Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 343 | పేజీలు 8 | వెల : 5 | బుధవారం 21 మే 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా!.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| మల్టీకలర్ | బ్లాక్ & వైట్ పేజీ |
|---|---|
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఫ్రంట్ పేజీ : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

## పెరిగిన పంటల దిగుడి...
# ధరలపై ప్రభావం

- రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు
- రేషన్ స్థానంలో నగదు బదిలీపై చర్చ
- లిక్కర్ స్కామ్‌పై మాట్లాడకండి
- కేబినేట్ భేటీలో సిఎం చంద్రబాబు సూచన



అమరావతి:రైతుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. రైతులకు స్వాంతన చేకూరేలా, క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించేలా ప్రభుత్వ చర్యలు ఉంటాయని తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్‌లో రైతాంగ సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. రేషన్ స్థానంలో నగదు బదిలీపై చర్చ చేశారు. కేబినెట్ సమావేశంలో 45 నిమిషాలు వ్యవసాయరంగం, అన్నదాతల కష్టాలు, మార్కెటింగ్‌పై చర్చ జరిగింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది వివిధ పంటల దిగుబడులు పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు. అంతర్జాతీయ పరిణామాలు, దేశవిదేశాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా వివిధ పంటల ధరలపై ప్రభావం పడినట్లు అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు. మిర్చి, పొగాకు, ఆక్వా, కోకో, చెరుకు, మామిడి వంటి పంట ఉత్పత్తుల ధరలు తగ్గడానికి గల కారణాలు వివరించారు. రైతుల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. వ్యవసాయ దిగుబడులు, గిట్టుబాటు ధరలు, నిత్యావసరాల ధరలపై ఆరుగురు మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ– ఏర్పాటు– చేసింది. రైతులకు గిట్టుబాటు ధర దక్కేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీ నిరంతర పర్యవేక్షించనుంది. రైతులకు స్వాంతన చేకూరేలా, క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించేలా ప్రభుత్వ చర్యలు ఉంటాయని సీఎం చెప్పారు. ప్రధానంగా జగన్ హయాంలో జరిగిన లిక్కర్ స్కాం అంశంపై కేబినెట్‌లో ప్రస్తావనకు వచ్చింది. మద్యం కుంభకోణం దర్యాప్తులో ఎవరు మాట్లాడవద్దని.. అనవసరంగా మాట్లాడితే మరో రకంగా వెళ్తుందని మంత్రులకు సీఎం తెలిపారు. సిట్ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తోందని... వాళ్ళ పని వాళ్ళని చూసుకోని వ్వాలన్నారు. మద్యం కుంభకోణంపై మాట్లాడితే ఇంకో రకంగా ఉంటుందని... అందుకని దర్యాప్తు సంస్థలకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలని సూచించారు. మద్యం కుంభకోణంపై పత్రికల్లో వచ్చిన వార్తలు చూసి ఎవరు మాట్లాడవద్దని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి అవుతున్న సందర్భంగా సాధించిన విజయాలు, ప్రజలు మనోభావాలపై వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చిద్దామని సీఎం అన్నారు.

పంటలకు ఈ సారి ధరలు తగ్గాయని.. మానిటర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

వైజాగ్ డిప్యూటీ– మేయర్ ఎన్నిక వాయిదా పడటంపై మంత్రి స్వామిని సీఎం ప్రశ్నించారు. అలా జరగకుండా చూడాలని సీఎం కోరారు. రేషన్ సరఫరాకు ఎండీయూ వాహనాలను కేబినెట్ రద్దు చేసింది. వీటిపై తీసుకున్న రుణాలను ప్రభుత్వం చెల్లించి వాహనాల యజమానులకు ఇచ్చేయాలని నిర్ణయించింది. బియ్యం ఇచ్చే రోజు మినహా మిగతా రోజుల్లో వాళ్ళే వాడుకుంటున్నారని... ఇకపై రేషన్ బియ్యం రేషన్ దుకాణాల్లోనే ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. వికలాంగులు, సీనియర్ సిటిజన్స్‌కు ఇంటికి వెళ్ళి బియ్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు.

# ఎట్టకేలకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నిక

## జనసేనకి చెందిన గోవింద్‌రెడ్డి ఏకగ్రీవం



విశాఖపట్టణం: ఉత్కంఠ రేపుతూ వచ్చిన గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నిక ఎట్టకేలకు ముగింది.. విశాఖ డిప్యూటీ మేయర్‌గా జనసేన పార్టీకి చెందిన కార్పొరేటర్ గోవింద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. అలకవీడి కౌన్సిల్ సమావేశానికి టీడీపీ సభ్యులు 59 మంది హాజరయ్యారు.. సోమవారం కోరం లేక విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడిన విషయం విదితమే.. సోమవారం జరగాల్సిన ఈ ఎన్నిక కోరం లేకపోవడంతో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. జీవీఎంసీ డిప్యూటీ– మేయర్ ఎన్నికకు మొత్తం 56 మంది కార్పొరేటర్లు కావాల్సి ఉండగా.. నిన్న జరిగిన ప్రత్యేక సమావేశానికి 54 మంది కార్పొరేటర్లు మాత్రమే హాజరయ్యారు. దీంతో డిప్యూటీ– మేయర్ ఎన్నికమంగళవారానికి వాయిదా పడింది.. అయితే, కోరం లేక ఎన్నిక నిలిచిపోవడంపై టీడీపీ, జనసేన హైకమాండ్ సీరియస్ అయ్యింది.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రంగంలోకి దిగారు.. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహా పలువురు నేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు.. అసంతృప్త కార్పొరేటర్లను బుజ్జగించి దారిలోకి తీసుకొచ్చారు ఎమ్మెల్యేలు.. దీంతో, ఇవాళ 59 మంది కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశానికి హాజరుకావడం.. కోరం ఉండడంతో.. డిప్యూటీ– మేయర్ ఎన్నికను పూర్తి చేశారు.. గత జీవీఎంసీ ఎన్నికల్లో మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను అప్పట్లో అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది... అయితే జీవీఎంసీ మేయర్ హరి కుమారిపై కూటమిలోని పార్టీలకు చెందిన కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి.. మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు.. మేయర్‌గా టీడీపీ నేత ప్రమాణస్వీకారం చేశారు.. అలాగే డిప్యూటీ– మేయర్‌పై సైతం అవిశ్వాస తీర్మానం పెట్టారు.. కూటమిలో పదవుల పంపకాల్లో భాగంగా.. డిప్యూటీ– మేయర్ పదవి జనసేన పార్టీకి కేటాయించాలని నిర్ణయించినా.. కొందరు ఆ నిర్ణయాన్ని వ్యతిరేకండం తో కాస్త ఆలస్యం అయ్యింది..



# జూన్ 1నుంచి రేషన్ షాపుల్లోనే బియ్యం పంపిణీ

- దోర్ డెలివరీకి గుడ్‌బై చెప్పిన ప్రభుత్వం
- వృద్ధులకు ఇంటి వద్దకే బియ్యం చేరవేత
- కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన నాదెండ్ల

**అమరావతి:** జూన్ ఒకటో తేదీ నుంచి చౌకధర దకాణాల ద్వారానే రేషన్ సరఫరా చేస్తామని, 66 ఏళ్లు పైబడిన వృద్ధులకు డోర్ డెలివరీ చేస్తాని ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రి పార్థసారధితో కలిసి నాదెండ్ల మనోహర్ మీడియాకు వెల్లడించారు. 29 వేల చౌక దుకాణాల ద్వారా గతంలో బియ్యం సహా ఇతర సరకుల సరఫరా జరిగేది. గత వైకాపా ప్రభుత్వం ఎండీయూల పేరిట ఈ వ్యవస్థను నాశనం చేసింది. 9,260 మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్‌ల కోసం రూ.1860 కోట్లు వృథా చేశారు. లబ్ధిదారులు తమ ఇబ్బందులను ఎవరికీ చెప్పుకోలేక పోయారు. 30శాతం మందికి రేషన్ అందడం లేదని ఐవీఆర్ఎస్ సర్వేలో తేలింది. రేషన్ సరఫరాకు వాహనాలు వచ్చాక జవాబుదారీ తనం లేదు, సరకులు ఎటు వెళు_న్నాయో తెలియదు. వందల సంఖ్యలో క్రిమినల్ కేసులు ఈ వాహనాల ఆపరేటర్‌లపై నమోదయ్యాయి. బియ్యం అక్రమ రవాణా కోసం ఓ గ్రీన్ ఛానెల్ ఏర్పాటు– చేసుకున్నారు. 29వేల దుకాణాలకు 9వేల వాహనాలు సరిపోతాయా? దొంగలెక్కలు చూపి బియ్యం దారి మళ్లించారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.27వేలు చొప్పున పౌరసరఫరాలశాఖ చెల్లిస్తోంది. చాలా అంశాలు పరిశీలించి వీటిని రద్దు చేయాలని నిర్ణయించాం. చౌక దుకాణాలు ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు అందుబాటు–లో ఉంటాయి. జూన్ 1 నుంచి చౌక దుకాణాల ద్వారా మాత్రమే రేషన్ సరఫరా అవుతుంది. 9,260 వాహనాలు ఉచితంగా ఆయా లబ్దిదారులకు బదలాయించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని వివరించారు.

# స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్ భేటీ

- అన్యాయం చేసిన వారికి శిక్షలు తప్పవు
- రాసి పెట్టుకోండి...అంటూ జగన్ సీరియస్ వార్నింగ్



అమరావతి: అన్యాయాలు చేసిన వారికి సినిమాలు చూపిస్తాం అంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అన్యాయం చేయాలనుకుంటే చేయమనండి.. కొడతానంటే.. కొట్టమనండి.. కానీ, మీరు ఏ పుస్తకంలోనైనా పేర్లు రాసుకోండని అంటూ జగన్ హెచ్చరించారు. మీకు శిక్ష తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమైన జగన్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి సర్కార్, అధికారులు, పోలీసులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది.. కానీ, కలియుగంలో రాజకీయాలు చేయాలంటే భయం ఉండకూడదు.. కేసులకు, జైళ్లకూ భయపడకూడదు.. అలా అయితేనే రాజకీయాలు చేయగలం.. చంద్రబాబు చేస్తున్న రాజకీయాలు అలా ఉన్నాయి అని ఫైర్ అయ్యారు.ఇక, చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీచేస్తున్నాడని దుయ్యబట్టారు వైఎస్ జగన్.. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. తిరువూరులో సంఖ్యాబలం లేని చోటకూడా టీ–డీపీ పోటీ–కి ప్రయత్నంచేస్తోంది.. మెజార్టీ వైసీపీ ఉందంటే ఎన్నికను ఆపుతున్నారు.. పోలీసులు.. వైసీపీ వాళ్లని అరెస్టు చేస్తున్నారు. టీ–డీపీ వాళ్లని రోడ్డుపై విడిచిపెడుతున్నారు.. కానీ, రేపు కచ్చితంగా వైసీపీకి కార్యకర్తే నంబర్ వన్ అని పేర్కొన్నారు.. అన్యాయం చేయాల నుకుంటే చేయమనండి.. కొడతానంటే.. కొట్టమనండి.. కానీ, మీరు ఏ పుస్తకంలోనైనా పేర్లు రాసుకోండి... మనకూ –టైం వస్తుంది.. అన్యాయాలు చేసిన వారికి సినిమాలు చూపిస్తాం.. రి–టైర్డ్ అయిన వారిని కూడా లాక్కుని వస్తాం.. దేశం విడిచిపెట్టి వెళ్లినా సరే రప్పిస్తాం.. అన్యాయాలు చేసిన ఒక్కొక్కరికి సినిమాలు చూపిస్తాం అని హెచ్చరించారు. చంద్రబాబు నాటిని విత్తనాలు.. కచ్చితంగా ఈ పరిస్థితులకు దారితీస్తాయి.. మహిళలు అని చూడకుండా నెలలతరబడి జైళ్లలో పెడుతున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు వైఎస్ జగన్.. ఒక కేసులో బెయిల్ వస్తుంది, అది రాగానే మరో కేసు పెడుతున్నారు.. ఇలా కేసులు మీదు కేసులు పెడుతున్నారు.. వల్లభనేని వంశీ విషయంలో ఇలాగే చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.. దళితుడైన నందిగం సురేష్ విషయంలోనే ఇలాగే దారుణాలు చేస్తున్నారు.. సుమారు నెలన్నరకుపైగా జైల్లో ఉండి బయటకు వచ్చిన తర్వాత ఇప్పుడు మళ్లీ కేసుపెట్టి జైల్లో వేశారు అంటూ మండిపడ్డారు.

# విదేశాంగ విధానంపై ప్రపంచ దేశాలకు వివరణ

- బృందంలో తనను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ లేఖ



2లో..

# మినీ అంగన్‌వాడీల జీతాలు పునరుద్ధరించాలి



2లో..

- పెంచిన జీతాలు ఎలా తగ్గిస్తారో చెప్పాలి
- తెలంగాణ రైజింగ్ అంటే ఇదేనా
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ



# పనిచేసిన వారికే పార్టీలో పదవులు

- పైరవి చేసి తెచ్చుకుంటే పక్కన పెడతాం
- మినీ మహానాడులో భూమా అఖిలప్రియ వార్నింగ్

నంద్యాల:మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సంచలన వ్యాఖ్యలు చేశారు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.. మాకు తెలియకుండా ఎవరైనా పదవులు తెచ్చుకుంటే వారిని నియోజకవర్గంలో కూడా అడుగుపెట్టనివ్వం అంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.. పదవులు ఇవ్వాలను కుంటే మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి మాత్రమే ఇవ్వండి అని సూచించారు.. లేకపోతే అసలు పని చేయని వాళ్లకి పదవులు ఇస్తే అది కరెక్ట్ కాదు అని హితవుచెప్పారు.. ఈ విషయం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు వెల్లడించారు.. పార్టీ కోసం, భూమా కుటుంబం కోసం పనిచేసిన వారికి తప్పకుండా పదవులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కాదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా విపక్షాలతో పాటు–.. కొందరు సొంత పార్టీ నేతలను కూడా టార్గెట్ చేస్తూ భూమా అఖిల ప్రియ పలు సందర్భాల్లో సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే.. అయితే, ఇప్పుడు మినీ మహానాడు వేదికగానే.. అది కూడా పార్టీ నేతలపై భూమా అఖిలప్రియ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆళ్లగడ్డ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిపోయింది.

# వక్ఫ్ చట్టంపై మరోమారు సుప్రీం విచారణ

- ప్రతిపాదిత మూడు అంశాలపైనే విచారణ
- సుప్రీంను కోరిన కేంద్ర ప్రభుత్వం

2లో..






# రాజ్‌భవన్ చోరీ కేసులో ట్విస్ట్

- హార్డ్ డిస్క్ చోరీలో శ్రీనివాస్ హస్తం
- మార్ఫింగ్ ఫోటోలు డిలీట్ చేసేందుకే శ్రీనివాస్ యత్నం
- ఎలాంటి ఫైళ్లు మాయం కాలేదని పోలీసుల గుర్తింపు

2లో..

# వక్ఫ్ చట్టంపై మరోమారు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఏదైనా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తే.. దాన్ని మూడు అంశాలకే పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. వక్ఫ్ చట్టంపై దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరపున వాదనలు వినిపిస్తూ.. గత బెంచ్ లాగానే విచారణను పరిమితం చేయాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనానికి తెలిపారు. కోర్టు మూడు అంశాలను గుర్తించిందని తుషార్ మెహతా తెలిపారు. ఆ మూడు అంశాలపై సమాధానం ఇచ్చామని.. తాజాగా పిటిషనర్లు లిఖితపూర్వక సమర్పణల్లో అనేక ఇతర అంశాలను లేవనెత్తుతున్నారన్నారు. తాము మూడు అంశాలపై తమ అఫిడవిట్ దాఖలు చేశామని తెలిపారు. కేసు విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలనేది కేంద్రం తరపున విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ వాదనను పిటిషనర్లు వ్యతిరేకించారు. పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి సొలిసిటర్ జనరల్ వాదనను వ్యతిరేకించారు. ఇంతకు ముందు ఏప్రిల్ 17న జరిగిన విచారణలో వక్ఫ్ బై-యూజర్‌తో సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీ-నోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. అలాగే, వక్ఫ్ బోర్డులలో కొత్త నియామకాలు చేపట్టబోమని సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా.. మూడు అంశాల విషయానికి వస్తే.. వక్ఫ్ బై యూజర్ లేదంటే.. వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారం కాగా.. రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లింలు వ్యతిరేకించడం రెండో అంశం కాగా.. మూడో అంశం నిబంధనకు సంబంధించింది. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుంచి కలెక్టర్ అధికారం ఇవ్వడంపై ఇది అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారంనాడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేననే భావన ఉందని, స్పష్టమైన సందర్భం వెల్లడి కానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోకూడదని అన్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోకూడదన్నారు. అంతకన్నా మాకు చెప్పవలసిన అవసరం లేదని చెప్పారు. వక్ఫ్‌ను స్వాధీనం చేసుకోవడం ఈ చట్టం ఉద్దేశమని పిటిషనర్ల తరఫు లాయర్ కపిల్ సిబల్ అన్నప్పుడు సీజేఐ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

వక్ఫ్ చట్టంపై గత విచారణ సందర్భంగా, మూడు అంశాలపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయడానికి వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించమని, ఈ మూడు అంశాలపై వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోమని సుప్రీంకోర్టుకు గత విచారణలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాగా, మంగళవారంనాడు విచార సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, వక్ఫ్ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఉత్తర్వులు జారీ చేయడానికి విచారణను మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. కోర్టు గుర్తించిన మూడు అంశాలకు తాము సమాధాం దాఖలు చేశామన్నారు. అయితే ఇప్పుడు పిటిషనర్ల లిఖిత పూర్వక సమాధానాలు ఇతర అంశాలను ప్రస్తావించాయని, విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. ఈ కేసును విచారించి, మధ్యంతర ఉపశమనం ఎక్కడ ఇవ్వచ్చో పరిశీలిస్తామని గత

సీజేఐ సంజీవ్ ఖాన్నా చెప్పారని, అందువల్ల కేవలం మూడు అంశాలకే తాము పరిమితమవుతామని చెప్పలేమని అన్నారు. వక్ఫ్ భూములను లాక్కోవడానికే చట్టం తెచ్చారని సిబాల్ వాదించారు. ఎలాంటి ప్రక్రియ లేకుండా వక్ఫ్ ఆస్తులను లాక్కోవడమే చట్టం ఉద్దేశమన్నారు.

# రాజ్‌భవన్ చోరీ కేసులో ట్విస్ట్

హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన రాజ్‌భవన్ చోరీ కేసులో మరో ట్విస్ట్ బయటపడింది. తోటి మహిళా ఉద్యోగిని ఫోటోలు మార్ఫింగ్ చేసి రాజభవన్ ఉద్యోగి భయభ్రాంతులకు గురిచేసినట్లు పోలీసులు విచారణలో బయటపడింది. రాజ్‌భవన్‌లో చోరీ కేసులో నిందితుడిని పంజాగుట్ట పోలీసులు రెండుసార్లు అరెస్ట్ చేశారు. మార్ఫింగ్ ఫొటో విషయంలో మొదటి సారి అరెస్ట్ చేయగా.. రెండో సారి రాజభవన్‌లోని హార్డ్ డిస్క్ చోరీ కేసులో నిందితుడిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సస్పెండ్ అయినప్పటికీ సెక్యూరిటీ-ని మాయ చేసి నైట్ -టైంలో ఎంట్రీ- ఇచ్చినట్లు- పోలీసులు గుర్తించారు. అయితే ఆ ఉద్యోగి వారంలో రెండు సార్లు అరెస్ట్ కావడం సంచలనం రేపుతోంది. రాజ్ భవన్‌లో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాస్ తన తోటి మహిళకు కొన్ని మార్ఫింగ్ ఫోటోలను చూపించాడు. ఎవరో తనకు ఈ ఫోటోలు పంపిస్తున్నాడు జాగ్రత్త అని చెప్పాడు. ఇంకా చాలా ఫోటోలను తన సిస్టంకు కూడా పంపించాడని భయపెట్టాడు. దీంతో కలవరానికి గురైన మహిళ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు..ఆ మార్ఫింగ్ ఫోటోలను శ్రీనివాస్ పంపించాడని తేల్చారు. దీంతో వెంటనే శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి వారం కింద రిమాండ్‌కు పంపారు. ఈ ఘటనతో రాజ్‌భవన్ అధికారులు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. జైలుకు వెళ్లిన శ్రీనివాస్ రెండు రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు.

జైలు నుంచి వచ్చిన అతడు రాత్రి సమయంలో సెక్యూరిటీని మభ్యపెట్టి లోపలికి వెళ్ళాడు. తన కంప్యూటర్‌లో ఉన్న హార్డ్ డిస్క్‌ను చోరీ చేసుకుని వెళ్ళిపోయాడు. ఈ సంఘటనపై పోలీసులకు రాజభవన్

అధికారులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన అధికారులు సీసీ కెమెరాల ద్వారా శ్రీనివాస్ చోరీని గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ హార్డ్ డిస్క్‌లో మహిళకు సంబంధించిన ఫోటోలు ఉండడంతో ఆ సాక్ష్యాలను డిలీట్ చేసే ప్రయత్నంలో చోరీకి పాల్పడాడ్డని తెలిసింది. దీంతో శ్రీనివాస్‌ను పోలీసులు రెండో సారి జైలుకు పంపారు. తొలుత రాజ్‌భవన్‌లో జరిగిన చోరీ కీలక హార్డ్ డిస్కులు, ఫైళ్లు మాయం అయినట్లు- ప్రచారం జరిగింది. అయితే ఫైళ్ల మాయంపై పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ వివరణ ఇచ్చారు. రాజ్ భవన్‌లో పనిచేసే ఓ మహిళ.. తన ఫోటోలను ఐటీ- ఉద్యోగి శ్రీనివాస్ మార్ఫింగ్ చేసినట్లు- తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు ఈనెల 12న శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని.. ఈ ఘటన తర్వాత శ్రీనివాస్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారన్నారు. మార్ఫింగ్ చేసిన ఫోటోలు, వీడియోలు ఉన్న హార్డ్ డిస్కుల కోసం శ్రీనివాస్ మళ్ళీ రాజ్ భవన్‌కు 14న వచ్చాడని.. హెల్మెట్ ధరించి హార్డ్ డిస్కులను దొంగలించా డన్నారు. దీనిపై దర్యాప్తు చేసి శ్రీనివాస్‌పై మరో కేసు నమోదు చేశామని.. 15న అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు. రాజ్ భవన్‌లో ఎలాంటి డాక్యుమెంట్లు-, ఫైల్స్ చోరీ అవ్వలేదని.. రాజ్ భవన్‌లో ఎలాంటి బయట వ్యక్తుల చోరీ జరగలేదని ఏసీపీ మోహన్ కుమార్ స్పష్టం చేశారు.

# విదేశాంగ విధానంపై ప్రపంచ దేశాలకు వివరణ

న్యూఢిల్లీ:ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత విదేశాంగ విధానాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు తనను ఎంపిక చేయడంపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ లేఖ రాశారు. భారత్‌కు ప్రాతినిధ్యం వహించే బాధ్యతను తనపై విశ్వాసంతో అప్పగించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తన తార్కిక, భాషా పటిమకు అనుగుణంగా ప్రధాని మోదీ ఎంపిక ఉందని వ్యాఖ్యానించారు. విమర్శకులను తికమక పెట్టేలా ఉన్న ప్రధాని నిర్ణయం అత్యున్నత పాలనా ప్రమాణాలకు అనుగుణంగా ఉందనీ కితాబునిచ్చారు.దేశాన్ని బలోపేతం చేసేందుకు అన్ని వర్గాల వారిని కలుపుకుని వెళ్లాలన్న కృతనిశ్చయం ప్రధాని నిర్ణయంలో ప్రతిఫలిస్తోందని వ్యాఖ్యానించారు. సంక్లిష్ట ఆంగ్ల భాషలో లేఖ రాసిన శశి థరూర్.. ప్రస్తుత పరిస్థితులను ప్రతిఫలించేలా పదజాలాన్ని ఎంచుకున్నట్టు- వివరించారు. మిలిటరీ చర్యల తర్వాత భారత్ వ్యూహాత్మక అవసరాలను ప్రపంచ వేదికలపై వివరించేందుకు తనను, ఇతర ఎంపీలను మోదీ ఎంపిక చేశారని అన్నారు. స్వతంత్ర అభిప్రాయాలున్న వ్యక్తులకు ప్రాధాన్యం ఉంటుందన్న రాజకీయ సంకేతం కూడా ఇందులో ఇమిడి ఉందని తెలిపారు. దౌత్యపరంగానూ ఇది తగిన చర్యని అభిప్రాయపడ్డారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చర్యకు అదే స్థాయిలో సంక్లిష్ట భాషతో జవాబిచ్చానని శశిథరూర్ అన్నారు. భారత్ ఉద్దేశాలు, ఆందోళనను ప్రపంచ దేశాలు అర్థం చేసుకునేలా తన దౌత్య పరిజ్ఞానం, భాషా నైపుణ్యాలతో వెల్లడిస్తానని అన్నారు. వివిధ దేశాల వారికి చేరేలా భారత వాణిని తగిన రీతుల్లో వినిపిస్తానని మాటిచ్చారు. ఈ మిషన్ ఫలితం ఎలా ఉన్నప్పటికీ భారతదేశ ప్రయోజనాల కోసం కట్టు-బడి ఉంటానని తెలిపారు. ఆంగ్ల భాషపై ఇంగ్లీష్ సాహిత్యవేత్తలతో సమానమైన పట్టున్న ఎంపీ శశి థరూర్ రాసిన ఈ లేఖ ప్రస్తుతం నెట్టింట పెద్ద చర్చకే దారి తీసింది. లేఖలోని పదజాలం, భావాల లోతు, అందులోని నిగూఢార్థాలను మెదడుకు ఎక్కించుకునేందుకు జనాలు విశ్వప్రయత్నం చేస్తున్నారు. తాము డిక్షనరీలు ముందేసుకుని కూర్చొని లేఖను చదువుతున్నామని కొందరు సెటైర్లు సైతం పేల్చారు.

# మినీ అంగన్‌వాడీల జీతాలు పునరుద్దరించాలి

హైదరాబాద్: మినీ అంగన్వాడీ కార్యకర్తలను అంగన్వాడీలుగా గుర్తించి పూర్తి జీతం చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. అంగన్వాడీలుగా గుర్తించి ఏడాది దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇప్పటికీ పెరిగిన జీతం ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఇచ్చిన జీవోను కాపీ కొట్టి రేవంత్ సర్కార్ ప్రచారం చేసుకున్నదని మండిపడ్డారు. మూడు నెలలు మాత్రమే పెంచిన జీతం ఇచ్చి గతేడాది కాలంగా వారిని పాత జీతానికే పని చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జీతాన్ని రూ.13,650 నుంచి తిరిగి రూ.7,800కి తగ్గించడం దారుణమని, బహుశా పెంచిన జీతాలను తగ్గించే కొత్త సాంప్రదాయానికి తెర లేపిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదేమోనని ఎద్దేవా చేశారు. అన్నింటా తెలంగాణ రైజింగ్ అని చెబుతూ అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ

మేరకు సిఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు లేఖ రాశారు. జనవరి 2024 నుంచి 12 నెలలకు పెరిగిన జీతాలు పూర్తి స్థాయిలో చెల్లించాలని డిమాండ్‌చేశారు. అంగన్వాడీ కేంద్రాలుగా మారిన ప్రతీ చోట హెల్పర్లను నియమించాలన్నారు. మే నెల పెరిగిన జీతాలు అందని జిల్లాల్లో తక్షణమే చెల్లించాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న మహిళల కడుపు కొడుతున్నాదని మండిపడ్డారు. మే నెల జీతాన్ని 8 జిల్లాల్లో మాత్రమే ఇచ్చి మిగతా జిల్లాల వారికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మినీ అంగన్వాడీలు ప్రచార సాధనాలు కాదని, వారికి నిజమైన గౌరవం ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మినీ అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న మానసిక వేదన, వారి కుటుంబాలు ఎదుర్కొంటు-న్న ఇబ్బందుల గురించి మీ దృష్టికి తీసుకురాదలిచాను. రాష్ట్రవ్యాప్తంగా 3,989 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలున్నారు .వీరంతా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అత్యంత పేదవర్గాలకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారు. మినీ అంగన్వాడీ కార్యకర్తల కష్టాలను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 5న వారికి అంగన్వాడీలుగా పదోన్నతి కల్పిస్తూ జీవో జారీ చేసింది. అయితే, ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఉత్తర్వులు అమలు కాలేదు.

# కాళేశ్వరంలో అవినీతి వెలికి తీసే పనిలో కమిషన్




**హైదరాబాద్:** రాజకీయ కక్షతో కాదు, కేవలం అవినీతి చెందిన బాధ్యులను వెలికితీసే ఉద్దేశంతోనే కాళేశ్వరంపై విచారణ జరుగుతోందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసే పార్టీ కాంగ్రెస్‌లో వివక్షకు అవకాశం లేదు. వివేక్, వంశీలపై ఎలాంటి వివక్ష లేదని పేర్కొన్నారు.తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జరుగుతున్న వివాదాల నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరంలో తప్పులు జరిగాయనే కారణంతోనే కమిషన్ కొంత సమయం తీసుకుని నివేదిక రూపొందించిందని ఆయన అన్నారు. కాళేశ్వరం విచారణలో కేసీఆర్, ఈటెల, హరీష్ రావులపై ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేయడం ముఖ్యమైన పరిణామంగా అభివర్ణించారు. వారు తప్పు చేయలేదంటే వివరణ ఇవ్వాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. కాళేశ్వరంలో తప్పు జరిగిన విషయాన్ని కమిషన్ తేల్చిందని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. విచారణ కమిషన్ శీలాన్ని శంకించాల్సిన అవసరం లేదు.. సాంకేతిక సమాచారం కోసం ఆలస్యం జరిగిందని అన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే, శిక్ష తప్పదని.. కేసీఆర్ అమెరికా పారిపోవాలని చూస్తున్నట్టున్నారని వ్యాఖ్యానించారు. అలాంటి పని చేయొద్దని, ప్రభాకర్ రావు వెళ్లినట్టు- మీరు పోకండని హెచ్చరించారు. అలాగే కాళేశ్వరం నీటిని లిఫ్ట్ చేయడానికి కాదు, క్యాష్ లిఫ్టింగ్ చేయడానికే వాడుకున్నారు. తెలంగాణను దొంగల దొడ్డిగా మార్చారు అంటూ మండిపడ్డారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో ఒక్క పిల్లర్ అయినా కూలిందా? కానీ కన్నెపల్లె పంపు హౌస్ ఎందుకు మునిగిందని నిలదీశారు.మరోవైపు ఈటెలపై కూడా సంచలన వ్యాఖ్యలు చేస్తూ.. ఈటెలను బీజేపీలోకి కావాలనే పంపించారా కేసీఆర్? బీఆర్ఎస్ లో అక్రమాలు చేసిన తర్వాతే ఆయన పార్టీ మారారన్న అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు సీల్డ్ కవర్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారని వ్యాఖ్యానించారు. అలాగే కిషన్ రెడ్డి లాంటి బానిసలతోనే దేశానికి నష్టం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసారు. దేశానికి ద్రోహం చేస్తున్న వాళ్ల పట్ల బీజేపీకి విధానం లేదని, రాహుల్ గాంధీ మీద మాట్లాడే అర్హత బీజేపీ నేతలకు లేదని ఆయన అన్నారు. బీజేపీ నేతలు ఎవరైనా దేశ స్వాతంత్రంలో పాల్గొన్నారా..? అంటూ ప్రశ్నించారు. పాకిస్తాన్ కు సమాచారం ఇచ్చిన కేంద్ర మంత్రి దేశ ద్రోహి కాదా.. కిషన్ రెడ్డి నల్లి కుట్ల లెక్క ఉంటాడని ఘాటు వ్యాఖ్యలు చేసారు. బీజేపీ కాదు.. బూతు జనతా పార్టీ, నీఛాతి నీచమైన బాషా.. సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని.బిజెపి పార్టీపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి అంటే. భారతీయ జనతా పార్టీ కాదని.. అది బూతు జనతా పార్టీ అని మండిపడ్డారు. బిజెపి సోషల్ మీడియా వాళ్లకు సిగ్గు, లజ్జ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీ భవన్ లో అద్దంకి మీడియాతో మాట్లాడుతూ.. 'బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి నల్లికుట్లోడి లాగ కనిపిస్తాడు.. కానీ ఇంత నీచపు సోషల్ మీడియా నడిపిస్తున్నాడు. వాళ్ల మీద కేసు పెడదామంటే ఒక్కరికి కూడా మొహం ఉండదు. నా పాత వీడియోలు తీసుకొచ్చి బుద్ధి లేకుండా ట్రోల్ చేస్తుందని దుయ్యబట్టారు. ప్రపంచంలో మూడు జెండర్స్ ఉన్నాయని.. బిజెపి వాళ్ళు ఏ జెండరో తేల్చుకోవాలని చురకలంటించారు. మీలాంటి బూతు భాష వాడే జాతి.. ఈ భూమి మీద ఎక్కడ లేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ధ్వజమెత్తారు.

# ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల చర్చలు

## ఉద్యమ కార్యాచరన వాయిదా

**అమరావతి:** ఉపాధ్యాయ సంఘాలతో ఏపీ ప్రభుత్వ చర్చలు ఫలించాయి. దీంతో ఉద్యమ కార్యాచరణను ఉద్యోగ సంఘాలు తాత్కాలికంగా వాయిదా వేసుకున్నాయి. సమాంతర మాధ్యమం విషయంలో మాత్రం మంత్రి నారా లోకేష్‌తో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోనున్నారు. మంగళవారం ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సచివాలయంలో చర్చించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తరపున చర్చలు ఫలించినట్లు వారు ప్రకటించారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ పద్ధతిలో బదిలీలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఒప్పుకుందని చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో 49 దాటిన తరువాత 2వసెక్షన్ ఏర్పాటు చేసేందుకు సర్కార్ అంగీకరించింది. ఫౌండేషన్ పాఠశాలల్లో 20 రోల్ దాటిన తరువాత 2వ పోస్టు ఇస్తామని.. ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే ప్రాథమిక పాఠశాలలు విడిగా నిర్వహిస్తామని కూడా ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అలాగే వర్క్ లోడ్ ఎక్కువయ్యే సందర్భంలో వర్క్ లోడ్ ఉన్న సబ్జెక్టులకు అవసరం మేరకు అకడమిక్ ఇన్ స్ట్రక్టర్, సర్‌ప్లస్ ఉపాధ్యాయులను సర్దుబాటు-చేయడానికి కూడా ప్రభుత్వం అంగీకరించింది.

# యూ ట్యూబర్ జ్యోతి మల్హోత్రా పై ప్రశ్నలు

న్యూఢిల్లీ:హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాపై దేశద్రోహం ఆరోపణలతో విచారణను భారత ఇంటెలిజెన్స్ ముమ్మరం చేసింది. ఈ కేసులో పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్, ఢిల్లీలోని పాక్ హైకమిషన్ అధికారుల పాత్రను లోతుగా పరిశీలిస్తుంది. ఈ కేసును ఫెడరల్ యాంటీ టెర్రర్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి అప్పగించాలని ఆలోచనలో కేంద్ర హోం శాఖ ఉంది. ఈ ఏజెన్సీ దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన కేసులను మరింత లోతుగా దర్యాప్తు చేస్తుంది. కాగా, పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో జ్యోతి మల్హోత్రాకు ఉన్న సంబంధాలు, ఆమె అంతర్జాతీయ పర్యటనలు, సమాచార బదిలీపై మరిన్ని వివరాలను సేకరించడానికి ఈ ఏజెన్సీ ఎం-కై-÷-వరీ చేయనుంది. అయితే, జ్యోతి మల్హోత్రా వెనుక భారీ కుట్ర దాగి ఉందని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానిస్తున్నాయి. యూట్యూబర్ జ్యోతితో సహా మొత్తం 14 మంది పాక్ గూఢచారులను ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో అరెస్టు చేశారు. ఈ వ్యక్తులు పాకిస్తాన్ ఐఎస్ఐకి ఏజెంట్లు-గా, ఇన్ఫార్మర్లుగా పని చేసినట్లు విచారణలో తేలింది. గత రెండు వారాలుగా నార్త్ ఇండియాలోని వివిధ ప్రాంతాల్లో ఈ అరెస్టులు కొనసాగాయి. దర్యాప్తు సంస్థలు జ్యోతి మల్హోత్రాతో సంబంధం ఉన్న దేశంలోని ఇతర వ్యక్తులను కూడా విచారణ చేస్తున్నారు. ఈ కుట్రలో పాకిస్తాన్ హైకమిషన్ అధికారుల పాత్రపై కూడా ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పై అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు వివిధ కోణాల్లో ఆమె నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, దుబాయ్‌ల్లో ఆమె చేసిన పర్యటనలపై వారు ప్రధానంగా దృష్టిసారించారు. నిందితురాలిని విచారించేందుకు ఎన్ఐఏ బృందం ఇక్కడికి వచ్చిందని హిస్సార్ ఎస్పీ శశాంక్‌కుమార్ సావన్ మీడియాకు వెల్లడించారు. ఇప్పటివరకు సేకరించిన సమాచారం ప్రకారం 2018లో ఆమెకు పాస్‌పోర్టు వచ్చింది. 2028 వరకు దానికి గడువు ఉంది. పాస్‌పోర్టు వచ్చినప్పటినుంచి ఆమె పాకిస్థాన్, చైనా, దుబాయ్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, ఇండోనేసియాల్లో ప్రయాణించింది. ఆ పర్యటనల గురించి సమాచారం సేకరిస్తున్నాం అని ఓ అధికారి వివరాలు వెల్లడించారు. ఈ కేసును ఫెడరల్ యాంటీ టెర్రర్ ఇన్వెస్టిగేటింగ్

ఏజెన్సీకి అప్పగించే అంశాన్ని హోంశాఖ పరిగణనలోకి తీసుకోవచ్చు. పాక్ హైకమిషన్ అధికారులు, పాక్ ఇంటిలిజెన్స్ విభాగానికి చెందిన వ్యక్తులు.. ప్రచారం కోసం, సమాచారాన్ని సేకరించడానికి ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లను ఉపయోగించు కుంటున్న కుట్ర కోణాన్ని దర్యాప్తు చేసేందుకు ఆ మేరకు నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోందని సమాచారం. తాజా అరెస్టులతో భారత్‌లో గూఢచర్యం నెట్‌వర్క్‌ను నిర్వహించడానికి

సాంకేతికతను ఉపయోగించుకుంటున్న తీరు బయటపడిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. పాక్-అఫ్గాన్ సరిహద్దు వరకు జ్యోతికి సంబంధాలు ఉన్నాయని తెలిపాయి. ఆ సరిహద్దు ప్రాంతం ఉగ్రవాద కార్యకలాపాలకు పేరు పొందింది. అలాగే మనుషుల సంచారంపై ఆంక్షలు ఉన్నాయి. పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. రెండు వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 12 మందిని అరెస్టు చేశారు. పంజాబ్‌లో ఆరుగురు, హరియాణాలో ఐదుగురు, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో

ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు- అధికారులు తెలిపారు. నిందితులు పాక్ నిఘా వర్గాలకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు- ఇప్పటివరకు చేపట్టిన దర్యాప్తులో వెల్లడైందన్నారు. వారి ఆర్థిక లావాదేవీలను సునిశితంగా పరిశీలిస్తున్నామని, ఎలక్ట్రానిక్ పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణ కూడా జరుగుతోందని చెప్పారు.

# ట్రంప్ తీరుతో ఆర్థికరంగంపై ప్రభావం !

దేశీయంగా వృద్ధి తగ్గడం మారకంపై తీవ్రంగా పడుతోంది. అయమెనికా దూకుడు విధానాలు, భారత్ లక్ష్యంగా విపరీతంగా టారిఫ్‌లు విధించడంతో అంతర్ఆజతీయంగా భారత్ మార్కెట్లు కూడా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. మనెగుమతలుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా తీరు భారత్కు పరీక్షా మారింది. చైనా ఎదురుదాడితో కొంత మేరకు దిగి వచ్చిన ట్రంప్ భారత్ విషయంలో మంకుపట్టుతో ఉన్నారు. మరీ ముఖ్యంగా ఇటీవలి పాక్‌తో కాల్పుల తరవాత ట్రంప్ తీరులో మార్పు మరీ విపరీతంగా ఉంది. రోణ రంగంలో భారత్ ఆధిపత్యాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. భారత్‌ను ఇరుకున పెట్టే చర్యలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. భారత్‌తో సంబంధాలు, వాణిజ్యం విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలను కలిగిస్తున్నది. అమెరికాకు రెండోసారి అధ్యక్షుడు అయినప్పటి నుంచి పలు వ్యతిరేక నిర్ణయాలు ప్రకటిస్తున్నారు. ట్రేడ్ టారిఫ్‌లు, ఇటీవల భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులలో ఆయన వ్యవహరించిన తీరు, కాశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వంపై ప్రతిపాదన తీవ్ర ఆశ్చర్యానికి గురి చేసింది. అరబ్ దేశాల పర్యటనలో ఉన్న ట్రంప్.. విదేశీ గడ్డపై మాట్లాడుతూ భారత్‌లో యాపిల్ కంపెనీ కార్యకలాపాలపై అసంతృప్తి వెళ్లగక్కిన తీరు కూడా ఆందోళనను, అనుమానాలను రేకెత్తించింది. ఈ క్రమంలో రోజురోజుకు రూపాయి విలువ పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మన ఆర్థిక వ్యవస్థ బలంగా లేదనడానికి ఇంతకన్నానిదర్శనం అక్కర్లేదు. గత కొన్ని మాసాలుగా రూపాయి పతనం వల్ల దిగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాగే విదేశీ మారక నిల్వలపై కూడా ప్రభావం పడుతోంది. రూపాయిని నిలబెట్టే చర్యలేవీ ప్రభుత్వం తీసుకోవడం లేదు. దీంతో ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగి, పేదలకు శరాఘాతంగా పరిణమిస్తోంది. డాలర్‌కు రూ.85.50 మధ్య మారకపు రేటు కొనసాగుతోంది. తాజాగా 86కు చేరువలో ఉంది.రిజర్వుబ్యాంక్ దగ్గర ఉన్న విదేశీ మారక నిల్వలను మార్కెట్ లోకి అదనంగా విడుదల చేసినప్పటికీ, రూపాయి విలువ పతనం ఆగడంలేదు. ఇబ్బడిముబ్బడిగా దిగుమతులు కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి. అలాగే జీఎస్టీ పోటుతో దేశీయంగా ధరలు విపరీతంగా పెరుగుతూ పోతున్నాయి. దీనిని తగ్గించాలన్న డిమాండ్‌ను పట్టించు కోవడం లేదు. ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచే చర్యలేవీ చేయడం లేదు. రూపాయి విలువ డాలర్÷-తో పోల్చుకున్నప్పుడు అతి తక్కువకు పడిపోయింది. విదేశీ మారకద్రవ్యాన్ని వివిధ కరెన్సీలలో దాచుకుంటారు. ఆ విధంగా కొంత యూరోల రూపంలో దాచినది ఉంది. యూరో విలువ కూడా డాలర్ తో పోల్చినప్పుడు తగ్గింది. ఆ విధంగా కూడా మన విదేశీ కరెన్సీ నిల్వల విలువ డాలర్‌తో పోల్చి నప్పుడు తగ్గింది. రూపాయి విలువ పడిపోకుండా నిలబెట్టడానికి ఆర్‌బిఐ ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయినా కూడా రూపాయి విలువ పడిపోతోంది. రూపాయి విలువ పడిపోవడం అనేది సామాన్యులకు భారంగా మారింది. దేశీయంగా కఠినచర్యలు తీసుకుంటే ఈ దుస్థితిరాదు. రూపాయి విలువ పడిపోవడం కారణంగా పెట్రో దిగుమతులకు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. దాని వలన పెట్రోలు డీజిల, వంటగ్యాస్ ధరలు మరింత పెరుగుతున్నాయి. అది ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ఈ ద్రవ్యోల్బణం విదేశీ మార్కెట్‌లో రూపాయి విలువ మరింత పడిపోడానికి దారి తీస్తుంది. ఆ విధంగా ద్రవ్యోల్బణం కారణంగా రూపాయి విలువ పతనం అన్న చక్ర భ్రమణం సాగుతోంది. రూపాయి విలువ పడిపోవడం కారణంగా మన దిగుమతులు మరింత ప్రియం అవుతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమనే ప్రహసనం చివరికు ప్రజల కొనుగోలు శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విదేశీ విద్య మరింత భారం అవుతోంది. విదేశీ ప్రయాణాలు కూడా భారంగా మారుతున్నాయి.

మొత్తంగా రూపాయి విలువ పడిపోవడం అనేది ప్రజల మీద మరింత పెద్ద దాడిగా పరిణమిస్తుంది. ఒకవేళ ఏదైనా తాత్కాలిక పరిణామం కారణంగా రూపాయి విలువ పడిపోతే, తిరిగి కొద్దికాలంలోనే మళ్ళీ కోలుకుని పెరిగే అవకాశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం రూపాయి విలువ పతనానికి కారణాలు వ్యవస్థీకృతమైనవిగా భావించాలి. విదేశీ చెల్లింపుల లోటు పెరిగిపోడానికి కారణం విదేశీ వ్యాపారంలో ఎగుమతులకన్నా దిగుమతుల విలువ ఎక్కువగా ఉండడం అని గుర్తించాలి. మన ఎగుమతులు పెరుగుతున్న వేగంతో పోల్చినప్పుడు దిగుమ మరోవైపు దిగుతులు ఇంకా వేగంగా పెరిగి పోతున్నాయి. అయితే దీనిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం తప్ప రూపాయి బలోపేతనాకి తీసుకుంటున్న చర్యలు కానరావడం లేదు.

గత ఆర్థిక సంవత్సరం 2024-25 జనవరి- మార్చి త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి 6.9 శాతంగా నమోదు కావొచ్చని ఇక్రా అంచనా వేసింది. 2024-25 మొత్తం మీద వృద్ధి 6.3 శాతంగా ఉండనుందని పేర్కొంది. ఫిబ్రవరిలో జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) అంచనా వేసిన 6.5 శాతం కంటే ఇది తక్కువ. జూన్, సెప్టెంబరు, డిసెంబరు త్రైమాసికాల్లో వృద్ధి వరుసగా 6.5 శాతం, 5.6 శాతం, 6.2 శాతంగా నమోదైంది. 2024-25లో ఎన్ఎస్ఓ వృద్ధి అంచనా 6.5 శాతాన్ని అందుకోవాలంటే, నాలుగో త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధిని సాధించాల్సి ఉంది. మే 30న 2024-25 నాలుగో త్రైమాసికంతో పాటు- పూర్తి ఆర్థిక సంవత్సరానికి జీడీపీ గణాంకాలను ఎన్ఎస్ఓ ప్రకటించనుంది. గత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసికాల్లో వృద్ధి గణాంకాల్లో సవరింపులు ఉంటే తప్పా, వృద్ధి 6.3 శాతానికి పడిపోనుంది. 2023-24లో జీడీపీ వృద్ధి 9.2 శాతంగా నమోదైంది. నాలుగో త్రైమాసికంలో ప్రైవేట్ వినియోగం, పెట్టు-బడుల ధోరణులు సరిగ్గా లేవని, టారిఫ్ సంబంధిత అనిశ్చితులు ఇందుకు తోడయ్యాయని ఆర్థికవేత్తలు తెలిపారు.

# తిరువూరు నగర పంచాయతీ వ్యవహారం

విజయవాడ: తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడం అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో కే.మాధురి ప్రకటించారు. సమావేశానికి మొత్తం 11 మంది కోరం ఉండాల్సి ఉండగా.. కేవలం ఎనిమిది మంది సభ్యులు హాజరయ్యారు. దీంతో ఎన్నికను వాయిదా వేశారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు తదుపరి ఛైర్మన్ ఎన్నిక జరుగుతుందని ఆర్డీవో వెల్లడించారు. మంగళవారంఉదయం ఎనిమిది మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్.. తిరువూరు నగర పంచయతీ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే సమావేశానికి మొత్తం 11 మంది కోరం ఉంటే సభ నిర్వహణ జరుగుతుంది. కానీ కేవలం ఎనిమిది మంది సభ్యులు మాత్రమే హాజరుకావడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు- ఆర్డీవో ప్రకటించారు. నగర పంచాయతీ ఎన్నికల కోసం పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు- చేశారు. తిరువూరు పట్టణంలో గత రెండు రోజులుగా ఈ ఎన్నిక ఉత్కంఠకు దారి తీసింది. ఈ ఎన్నికను ఇటు టీడీపీ, అటు వైసీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు- చేశారు. ఎన్నిక జరిగే ప్రాంగణానికి ఎవరినీ అనుమతించలేదు. కేవలం సభ్యులను మాత్రమే అనుమతించారు. సోమవారం వైసీపీకి చెందిన ముఖ్య నేతలు ఎన్నిక జరిగే ప్రాంతానికి వచ్చి హడావుడి చేసిన విషయం తెలిసిందే. వారంతా కూడా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే అధికారులు వారికి తొలగ్గకుండా నిబంధన ప్రకారం ముందుకు వెళ్లారు. పలువురు సభ్యులను రానీయకుండా వైసీపీ అడ్డుకుంటోందని... వారందరిని కూడా వైసీపీకి చెందిన కీలక నేతలు ఎక్కడో తీసుకెళ్లి దాచిపెట్టారని టీడీపీ సభ్యులు చెబుతున్నారు. కాగా.. తిరువూరు నగర పంచాయతీ 13వ వార్డు కౌన్సిలర్ ఇనపనూరి చిన్నారిని ఐదు రోజులు క్రితం తిరువూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ నల్లగట్ల స్వామిదాస్ కారులో తీసుకుని వెళ్ళారని చిన్నారి తండ్రి, కొడుకు ఆందోళనకు దిగారు. తమ కూతురిని అప్పచెప్పాలని టీ-డీపీ నాయకులతో కలిసి నల్లగట్ల స్వామిదాస్ ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలో స్వామి దాసు ఇంటి ముందు వైసీపీ నాయకులకు, టీ-డీపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు- చేసుకుంది. వెంటనే రంగ ప్రవేశం చేసిన పోలీసులు.. ఎటు-వంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

# రైతంగ, కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు: ఏఐటీయూసీ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు మే 20 మంగళవారంనరేంద్ర మోడీ సర్కార్ అవలంబిస్తున్న కార్మిక, కర్షక,రైతాంగ హక్కులను కాల రాస్తే కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఏఐటియుసి ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సోమప్ప సర్కిల్ నందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు వీరేష్, తాలూకా ఉపాధ్యక్షుడు అమాలి వీరేష్, లు మాట్లాడుతూకార్మికులు ఉద్యోగులను మరింత అభద్రతాలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం ఎక్కిందని, ప్రధానంగా కార్మికులు ఎన్నో ఏళ్ల పోరాటాలు ద్వారా సాధించుకున్న 44 చట్టాలను రద్దు,కేవలం 4 లేబర్ కోడ్లును రూపొందించి కార్మిక హక్కులను హరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు చెల్లించి కాంట్రాక్ట్ కార్మికులను స్కీం వర్కర్లుగా గుర్తించాలని వారు తెలిపారు.
అందరికీ ఉచిత విద్య అందించి ఆరోగ్య సంరక్షణ తాగునీటి పారిశుధ్య గృహ నిర్మాణం వంటి అంశాలపై ప్రభుత్వం హామీ ఇవ్వాలి 2020 నూతన విద్య విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు తెలిపారు. ప్రభుత్వం అన్ని ఆహార ధాన్యాలను స్వామినాథన్ సిఫారసు ప్రకారం( సీ2 ప్లస్ 50) మద్దతు ధర కొనుగోలు చేసి విత్తనాలు ఎరువులు విద్యుత్ పై రైతులకు ఇచ్చే రైతులను పెంచాలి పంటల భీమను ప్రవేశపెట్టి రుణ బాధ్యతను రద్దు చేయాలి కిషన్ మోర్చ్ ప్రారంభించిన చారిత్రకమైన పోరాటం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలకు ఇచ్చిన అన్ని లిఖితపూర్వక హామీలను అమలు చేయాలని వారు తెలిపారు. పీఎఫ్ బోనస్ పై ఉన్న అన్ని పరిమితులను తొలగించి గ్రాట్యూటీ మొత్తాన్ని పెంచాలని ఉపాధిని అవుట్సోర్సింగ్ చేయడం పరిమిత కాల ఉపాధిని తీసుకురావడం ఆమోదయోగ్యం కాదని అన్ని రకాల కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమానమైతాం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, వెంకటేష్,నాగేంద్ర,షరీఫ్, ఇస్మాయిల్,గోపాల్,హరి, నరసప్ప, సమీయుల్లా,రాజీవ్, నాగరాజు,హనుమంతు, జబ్బర్,మాలిక్, తదితరులు పాల్గొన్నారు.



## గోనెగండ్ల మండలం గంజల గ్రామ సమీపంలో రెండు బైకులు డి ఒకరికి తీవ్ర గాయాలు ఇద్దరికీ స్వల్ప గాయాలు

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

గోనెగండ్ల మే 20 మంగళవారం గోనెగండ్ల మండల పరిధిలోని గంజిహిళ్ళ గ్రామం సమీపంలోని రెండు బైకులు ఢీకొన్నాయని సమాచారం ఒకరికి తీవ్రగాయాలు కాగా ఇద్దరు స్వల్ప గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు గోనెగండ్ల మండలం అయ్యకొండ గ్రామానికి చెందిన యువకుడు సీరియస్ గా ఉందని గోనెగండ్ల వైద్యులు తెలిపారు మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం

## విద్యుత్ సర్క్యూట్తో యువకుడు మృతి

**ఉత్తేజిత న్యూస్ సి.బెళగల్ మే 20**



సి.బెళగల్ మండలం బ్రాహ్మణ దొడ్డి రెవెన్యూ గ్రామ పరిధిలోని ఎర్రగుంట కొట్టాల సమీపంలో గూడూరు గ్రామానికి చెందిన లాల్ బాషా (గౌండ లాల్ భాష) పొలంలో విద్యుత్ లైన్లు లాగుతుండగా సి.బెళగల్ మండలం పొలకల్ గ్రామానికి చెందిన గొల్ల తిరుపాల్ కుమారుడు గొల్ల రాజు(17) విద్యుత్ శాఖ గురై మృతి చెందాడు. పోలకల్ గ్రామానికి చెందిన గొల్ల శేఖర్ సి.బెలగల్ సబ్ స్టేషన్ లో షిఫ్ట్ ఆపరేటర్తో తో పాటు, విద్యుత్ కాంట్రాక్ట్ పనులు కూడా నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన రాజును కాంట్రాక్టర్ శేఖర్ బ్రాహ్మణ దొడ్డి గ్రామ పరిధిలో విద్యుత్ పనులు చేయడానికి తీసుకెళ్లాడు. విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ గురై రాజు మృతి చెందాడు.విద్యుత్ పనులు చేస్తున్న ప్రదేశం బ్రాహ్మణ దొడ్డి గ్రామ పరిధిలో ఉన్నది. కాంట్రాక్టర్ శేఖర్ బ్రాహ్మణ దొడ్డి పరిధిలో విద్యుత్ ఎల్.సి పనులు చేస్తున్నారు. కానీ పనిచేసే ప్రదేశం పొనకల్ గ్రామం విద్యుత్ పరిధిలోకి వస్తుంది. పొన్నకల్ గ్రామ పరిధిలో ఎల్ సి తీసుకోకుండా విద్యుత్ పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ మరియు విద్యుత్ లైన్మెన్ల నిర్లక్ష్యం నిండు ప్రాణం బలైందని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు.

# ఎమ్మిగనూరు పట్టణంలోని న్యూ ఎస్.సి.కాలనీ నందు సి.సి రోడ్ల నిర్మాణం చేపట్టాలి

### సి.సి.రోడ్లు లేక గుంతలమయంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసుల సమస్యను తక్షణమే పరిష్కరించాలి

### సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు మే 20 మంగళవారం పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీ నందు సిసి రోడ్లు లేక, వర్షపు నీటితో గుంతల మయంగా మారిన దుస్థితి కాలనీవాసులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ప్రభుత్వ అధికారులు సమస్యను పరిష్కరించాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న డిమాండ్ చేశారు. సోమవారం నాడు స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీ నందు మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రధానంగా సిసి రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరి విష జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తేలికపాటి వర్షం పడిన ఇక్కడి రహదారి మొత్తం గుంతలమయంతో ,బురద ఎక్కువగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు నడవలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్న వంకలో కోళ్ల వ్యర్థాలు ,మురుగునీరు పూర్తిగా కాలనీ లోకి ప్రవేశించి దుర్వాసన విపరీతంగా ఉన్నదని తెలిపారు. తక్షణమే వంకకు ప్రహరీ గోడ నిర్మించి వంక మురుగునీరు కాలనీలోకి ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యూ ఎస్సీ కాలనీ తో పాటు ఎస్ఎంటి కాలనీ మునెప్ప నగర్ నందు కూడా ఈ వంక వలన సమస్య ఏర్పడిందని తెలిపారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి ఎమ్మిగనూరు మున్సిపాలిటీ కమిషనర్ ఈ కాలనీలను పరిశీలించి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులతో పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, వంకకు ప్రహరీ గోడ తక్షణమే యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు నాయకులు బాలరాజు,బాబు,కాలనీ వాసులు బాలస్వామి, నగేష్,రాజు,శాంతి,లక్ష్మీ,సులోచన తదితరులు పాల్గొన్నారు.

## సిద్దేశ్వర అలుగు రాయలసీమ వెలుగు

**సిద్దేశ్వరం పోస్టర్ ఆవిష్కరణ రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక**



**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు మే 20 మంగళవారం పెన్షనర్ల కార్యాలయంలో రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిద్దేశ్వరం అలకు రాయలసీమ వెలుగు పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా నాయకులు కన్వీనర్ టీచర్ నాగన్న ఏనుగు బాల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మే 31 న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవమును భారీ ఎత్తున జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు అలాగే కూటమి ప్రభుత్వం రాయలసీమకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని వారు పిలుపునిచ్చారు ముఖ్యంగా ముఖ్యంగా కృష్ణానది యాజమాన్యం కర్నూల్ లో ఏర్పాటు చేయాలని అమరావతిని ఫ్రీ జోన్ చేయాలని విభజన చట్టంలో ఉన్న రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కడప ఉక్కుని సాధించాలని వారు పిలుపునిచ్చారు మరి ముఖ్యంగా రాయలసీమలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను ఆర్డీఎస్ వేదవతి గుండ్రేవులను వెంటనే చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కృష్ణ రఘు కాజా వివిధ ప్రజాసంఘాల నాయకులు కాశీ విశ్వనాథరెడ్డి రామకృష్ణారెడ్డి సత్యనారాయణరెడ్డి స్వామి దాసు నరసప్ప బతకన్న అమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు మే 20 తేది కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను అమలు చేయాలని కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ చట్టాలు రద్దు చేయాలని

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు మే 20 మంగళవారం పట్టణంలో స్థానిక కార్మిక సంఘాలు ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో ర్యాలీ నిరసన విజయవంతం ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సిఐటియు మండల అధ్యక్షులు పి గోవిందు అధ్యక్షతన జరిగిన సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బి గోవర్ధనమ్మ ఐ ఎఫ్ టి యు జిల్లా తాలూకా నాయకులు పి ప్రసాద్ కే అనిఫ్ ఎస్ బాలరాజు ఏఐ కేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్ రాజు ఎం సత్తన్న బి ఏ షేపు వీరు మాట్లాడుతూ కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో ఎమ్మార్వో కార్యాలయం నుండి వైయస్ సర్కిల్ నుండి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలతో సర్కిల్ నందు 100 మందితో నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వంలో 1926 నుండి నేటి వరకు కార్మిక చట్టాలు సాధించుకున్నారని ఈ చట్టాల ద్వారా కార్మికుల ప్రయోజనాలు పొందుతున్నారని తెలిపారు బిజెపి ప్రభుత్వం 2019 2020 కరోనా సమయంలో ఏకపక్షంగా నరేంద్ర మోడీ గారు కార్మికుల చట్టాలను కుదింపు చేయడం నలభై నాలుగు చట్టాల నుండి 29 చట్టాలు కుదింపు చేసి వాటిని కూడా నాలుగు లేబర్ చట్టాలుగా పార్లమెంట్లో తీర్మానం చేయడం దాన్ని దేశవ్యాప్తంగా ఉద్యోగ కార్మిక సంఘాలు ముక్తకంఠంగా వ్యతిరేకించాయని తెలిపారు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూపాయలు 26000 ఇవ్వాలని అలాగే శ్రామిక మహిళలకు చట్టాలు సౌకర్యాలు కల్పించాలని గ్రాచుటీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని తీర్పు ఇవ్వడం జరిగింది కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును నిర్లక్ష్యం చేయడం చాలా దుర్మార్గమని అన్నారు ఢిల్లీ కేంద్రంలో 14 నెలలు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని ఆందోళన చేసినప్పటికీ ఫిరంగిలు పోలీసులు లాటి చార్జీలు ముళ్ళకంపలు కేంద్ర ప్రభుత్వం వీటి ద్వారా బెదిరించిన రైతులు ఉద్యమాలు చేశారని ప్రాణాలర్పించారు అయినప్పటికీ నరేంద్ర మోడీ గారు నేటికీ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం దేశ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు గ్రామీణ ఉపాధి పథకము కార్మికులకు చేతినిండా పని లేక చేసిన పనికి వేతనాలు లేక కేంద్ర ప్రభుత్వం సరైన బడ్జెట్ ఇవ్వకపోవడం చాలా అన్యాయమన్నారు తక్షణమే కేంద్ర ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న 44 చట్టాలను అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 26 వేల రూపాయలు ఇవ్వాలని గ్రాట్యుటీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని రైతులకు మద్దతు ధర ఇవ్వాలని ఉపాధి హామీ కార్మికులకు బడ్జెట్ కేటాయించాలని తదితర సమస్యలను దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామని నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ సిఐటియు ఏఐకేఎంఎస్ ఐఎఫ్టియు వెల్డింగ్ కార్మిక సంఘం నాయకులు ఎం బతకన్నా లక్ష్మీ నరసయ్య ఎం అబ్దుల్లా ఏ సురేష్ యు రమేష్ జయన్న పి రాజు బాబు ప్రతాప్ బి కేసన్న కే ఇస్మాయిల్ ఎం రామన్న సుభాన్ అంగన్వాడి యూనియన్ నాయకులు ఎం అరుణ విజయమ్మ పి రాగమ్మ బుట్టా శారద రామలింగమ్మ జైతున్ శంషు బేగం సరోజ ఈరమ్మ పక్కీరప్ప తదితర కార్మిక సంఘం నాయకులు తాపీ కార్మిక సంఘం నాయకులు వీ తాయప్ప ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు

## పొరపాట్లకు తావు లేకుండా రీ సర్వే నిర్వహించండి: ఆర్డీఓ కిడారి సందీప్

**సి.బెలగల్ ఉత్తేజిత న్యూస్ మే 20**



సి.బెళగల్ మండలం బ్రాహ్మణ దొడ్డి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 119 లో రెండో బృందం నిర్వహిస్తున్న రీ సర్వేను ఆర్డిఓ కిడారి సందీప్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వేను నిర్వహిస్తుందని, రీ సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.
రీ సర్వే నిర్వహించే ప్రాంతాలలో రైతులకు ఒక రోజు ముందుగానే సమాచారం అందించాలని తెలిపారు.
రైతుల సమ్మతితోనే రీ సర్వేను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పురుషోత్తముడు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు మంజీర, సాయి రమణ, గ్రామ సర్వేయర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు భూసేకరణ, నిర్మాణ పనులను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,మే 20 :**




జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు , చెన్నై నేషనల్ హైవే పి డి లు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీఓలు, కిరణ్మయి, భానుప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి టౌన్ సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఆరు లైన్ల రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని, రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు. తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎ డి బి రోడ్లు పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, డెప్యూటీ తాసిల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక

# తిరుమలకొండపై పచ్చదనాన్ని మరింత పెంచుతాం

## టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు



**తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, మే 20.**

తిరుమలలోని అన్నమయ్య భవన్ లో మంగళవారం ఉదయం టీటీటీ ధర్మకర్తల మండలి సమావేశం జరగింది. టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ధర్మకర్తల మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ వివరాలను టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు మీడియాకు వివరించారు.

**టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం ముఖ్య నిర్ణయాలు**

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమల కొండల్లో ఉన్న పచ్చదనాన్నిఅటవీశాఖ ద్వారా 68.14 శాతం నుండి 80 శాతానికి పెంచేందుకు నిర్ణయం. ప్రభుత్వ ఆమోదం వచ్చాక దశలవారీగా 2025-26 సంవత్సరంలో రూ.1.74కోట్లు, 2026-27 సంవత్సరంలో రూ.1.13కోట్లు, 2027-28 సంవత్సరానికి రూ.1.13కోట్లు ప్రభుత్వ అటవీశాఖకు విడుదల చేసేందుకు నిర్ణయం.

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగాలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాల అభివృద్ధి కోసం సమగ్ర బృహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్ట్ ల నుండి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయం.తిరుమలలోని విశ్రాంత భవనాల పేర్ల మార్పులో మిగిలిన ఇద్దరు దాతలు స్పందించలేదు. దీంతో ఈ విశ్రాంతి గృహాల పేర్లను టీటీడీనే మార్పు చేయాలని నిర్ణయం. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. తిరుమలలోని బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల లైసెన్సు ఫీజును నిర్ణయించే అంశంపై ఆమోదం. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరొందిన సంస్థలకు ఇవ్వాలని నిర్ణయం. ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాలను భక్తులు విశేష సంఖ్యలో సందర్శిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయం. రాయలసీమకే తలమానికంగా ఉంటూ ఎందరో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఆర్థిక సహాయంగా ఏడాదికి ఇప్పుడు అందిస్తున్న రూ.60కోట్లతో పాటు అదనంగా మరో రూ.71 కోట్లు అందించేందుకు ఆమోదం. స్విమ్స్ మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది నియామకం చేపట్టేందుకు నిర్ణయం. అదేవిధంగా 85శాతం నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవంతులను (ఆంకాలజీ మరియు పద్మావతి చిన్ని పిల్లల ఆసుపత్రిలతో కలిపి) త్వరలోనే మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా నిర్ణయం. శ్రీవారి వైద్య సేవను కూడా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం. టీటీడీలో పని చేస్తున్న అన్యమతస్తులను బదిలీ చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, స్వచ్ఛంద పదవీ విరమణకు చర్యలు తీసుకునేందుకు ఆమోదం. తిరుమల ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని యాంటీ డ్రోన్ టెక్నాలజీ వాడాలని నిర్ణయం. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం. ఒంటిమిట్టలో భక్తులకు అన్నదానం సేవలను మరింత పెంచాలని నిర్ణయం. తుళ్లూరు మండలం అనంతవరంలోని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయం. ఇందుకు రూ.10 కోట్లు కేటాయించేందుకు ఆమోదం. శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డీడీ నెక్ట్స్ లెవల్ చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయం.

# "టీడీపీ నిర్లక్ష్యం కారణంగా వైయస్ఆర్ హెల్త్ క్లినిక్స్

**"టీడీపీ నిర్లక్ష్యం కారణంగా వైయస్ఆర్ హెల్త్ క్లినిక్స్ మూసివేత గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రత నాశనం" - వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బిసి సెల్ సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డి .**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు, మే 20: మంగళవారం ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని ముగతి గ్రామం నందు తన స్వగృహంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బిసి సెల్ సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నేరుగా, తక్షణ ఆరోగ్య సేవలు అందించాలనే మహత్తర ఆవశ్యకతను గుర్తించి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019-20లో చేపట్టిన వైయస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ (YSR VHCs) కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో సంచలనమైన మార్పులను తీసుకువచ్చింది.ఈ హెల్త్ క్లినిక్స్ పేద, మధ్యతరగతి ప్రజలకు వారి గ్రామంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో అద్భుతమైన సేవలందించాయి. దేశంలో ఇలాంటి వాస్తవం మరో రాష్ట్రంలో లేదు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం 10,000కి పైగా హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేసి, సుమారు 3,000-4,000 జనాభా ఉన్న ప్రతి గ్రామానికి ఒక వైద్య కేంద్రం ఏర్పాటు చేసింది.సర్వత్రా వైద్య సదుపాయాలు: 14 రకాల ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు మరియు చికిత్సలు, ఇందులో బీపీ, షుగర్, టిబి స్క్రీనింగ్, రక్త పరీక్షలు, మాతృశిశు సంరక్షణ, టీకాలు, ఆహార సూచనలు, మలేరియా నిర్ధారణలు ఉన్నాయి.ప్రముఖమైన మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (MLHP): B.Sc Nursing పూర్తి చేసిన యువతులను నియమించి, ANMలు, ఆశా వర్కర్లతో కలిసి గ్రామస్థాయిలో ఆరోగ్య సేవల కోసం సమన్వయం చేశారు

**ప్రతి రోజు వైద్య సేవలు**

గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిస్థితిని మానిటర్ చేసి, అనుమానాస్పద కేసులను తక్షణమే వైద్య పరీక్షలకు తరలించారు.కరోనా సమయంలో కీలక పాత్ర: మహమ్మారి సమయంలో క్లినిక్స్‌లో ఉచిత రక్తపరీక్షలు, వైద్య సలహాలు అందించడం ద్వారా వైరస్ వ్యాప్తి నియంత్రణకు గొప్ప సహకారం అందించారు.2025 ఏప్రిల్ 24 తేదీన హెల్త్ క్లినిక్స్‌లో పనిచేస్తున్న %మీూవ్రా%లు తమ వేతనాలు, ఇన్సెంటివ్స్ విడుదలకు వేటు పడడంతో సమ్మె నిర్వహిస్తున్నారుఈ సమ్మె కారణంగా, వైద్య కేంద్రాలు మూతపడటం, గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందకపోవడం తీవ్ర పరిస్థితిని సృష్టించింది.పేద, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ దవాఖానాలకు వెళ్ళాల్సి వస్తోంది, వారు అధిక ధరకే వైద్యం పొందాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటి వరకు MLHPల సమస్యలకు పరిష్కారం చెప్పక, నిర్లక్ష్యం ప్రదర్శించింది.మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల వేతనాలు, ఇన్సెంటివ్స్ తక్షణమే చెల్లించాలి.వైయస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను వెంటనే తిరిగి ప్రారంభించాలి.ఆరోగ్య సిబ్బంది పట్ల గౌరవం, శ్రమకు తగిన విలువ ఇవ్వాలి.గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవల కొనసాగింపు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి.ముఖ్యంగా పేదల ఆరోగ్య హక్కుల పరిరక్షణపై ప్రభుత్వం తగిన బాధ్యతలు వహించాలి. వైయస్ఆర్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆఫీసు నేరుగా మానిటరింగ్ చేయడంతో ఆరోగ్య రంగానికి భారీ మార్పులు వచ్చాయి.గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ఆధునీకరణతో పేదలకు క్షుణ్ణమైన వైద్య సేవలు అందించడానికి ప్రాధాన్యం ఇచ్చారు.ఉచిత మందుల పంపిణీ, పరీక్షల సౌకర్యాలు, యోగ్యత ఉన్న నర్సింగ్, ఆరోగ్య సిబ్బంది నియామకాలు వలన గ్రామీణ ఆరోగ్యం మెరుగుపడింది.సమగ్ర ఆరోగ్య సంరక్షణతో పేద కుటుంబాల జీవిత ప్రమాణాలు మెరుగయ్యాయి అని వారు అన్నారుఈ కార్యక్రమంలో నందవరం మండల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి,మల్లికార్జున, భీముడు, హుస్సేని తదితరులు పాల్గొన్నారు

## తుడా పరిధిలో కొత్త లేఔట్ల ఏర్పాటుకు స్థలాలను పరిశీలన చేస్తున్నాం.

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి,మే 20.**



తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని సూళ్లూరు పేట, నాయుడుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో కొత్తగా లేఅవుట్లు ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలన చేస్తున్నామని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అన్నారు. మంగళవారం తుడా అధికారులతో కలసి నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో లేఅవుట్లు వేయడానికి అనువైన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా తుడా పరిధిలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండే భూములను గుర్తిస్తున్నామని అన్నారు. ఆ భూములు కొనుగోలు చేసి అందులో లేఅవుట్లు వేసి అభివృద్ధి చేస్తామని అన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఉపాధ్యక్షులను కలిసి సూళ్లూరుపేట లోని పార్క్ ను, రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. తుడా పరిధిలో బడ్జెట్ పరిశీలించి అన్ని పనులు చేయిస్తామని అన్నారు. ఈ స్థల పరిశీలనలో తుడా సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, సిపిఒ దేవికుమారి, ఎల్.ఏ.ఓ. సుజన, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## రైతులు పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి: ఏపీడి అల్లి పీరన్

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ మే 20**



పొలం ఉన్న ప్రతి రైతు పండ్ల తోటల పెంపకాలను ప్రోత్సహించాలని ఉపాధి హామీ ఎమ్మిగనూరు క్లస్టర్ ఏపీడి అల్లిపీరన్ అన్నారు. మంగళవారం సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణ దొడ్డి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి శ్రామికులతో ఏపీడి అల్లి పీరన్ మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికులు ప్రతి ఒక్కరూ కొలతల ప్రకారం పని చేస్తే ఒక రోజుకు 307 రూపాయల వేతనం పొందవచ్చని తెలిపారు. అలాగే పొలం ఉన్న ప్రతి రైతు పండ్ల తోటల పెంపకాలను ప్రోత్సహించాలని, అలాగే ప్రతి రైతు పొలంలో ఫారం ఫండ్స్ గుంతలు తవ్వించుకోవాలని తెలిపారు. ఫారం ఫండ్స్ తవ్వించుకోవడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం బ్రాహ్మణ దొడ్డి గ్రామ సచివాలయంలో బ్రాహ్మణ దొడ్డి గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ పై విచారణ జరిపారు. అనంతరం సి.బెళగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఉపాధి కూలీల రిపోర్టు, ఉపాధి హామీ పని దినాల పెంపు, ఫారం ఫండ్స్, హార్టికల్చర్, నామాలలో నిర్మిస్తున్న కంపోస్ట్ పిట్స్ అంశాలపై గ్రామ పంచాయతీ వారిగా టెక్నికల్ అసిస్టెంట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం టెక్నికల్ అసిస్టెంట్ల కు పలు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రామన్న, జె.ఈ రంగస్వామి, ఆయా గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# ట్రంప్ తీరుతో ఆర్థికరంగంపై ప్రభావం !

దేశీయంగా వృద్ధి తగ్గడం మారకంపై తీవ్రంగా పడుతోంది. అయమెనికా దూకుడు విధానాలు, భారత్ లక్ష్యంగా విపరీతంగా టారిఫ్‌లు విధించడంతో అంతర్ఆజతీయంగా భారత్ మార్కెట్లు కూడా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. మనెగుమతలుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా తీరు భారత్కు పరీక్షా మారింది. చైనా ఎదురుదాడితో కొంత మేరకు దిగి వచ్చిన ట్రంప్ భారత్ విషయంలో మంకుపట్టుతో ఉన్నారు. మరీ ముఖ్యంగా ఇటీవలి పాక్‌తో కాల్పుల తరవాత ట్రంప్ తీరులో మార్పు మరీ విపరీతంగా ఉంది. రోణ రంగంలో భారత్ ఆధిపత్యాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. భారత్‌ను ఇరుకున పెట్టే చర్యలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. భారత్‌తో సంబంధాలు, వాణిజ్యం విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలను కలిగిస్తున్నది. అమెరికాకు రెండోసారి అధ్యక్షుడు అయినప్పటి నుంచి పలు వ్యతిరేక నిర్ణయాలు ప్రకటిస్తున్నారు. ట్రేడ్ టారిఫ్‌లు, ఇటీవల భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులలో ఆయన వ్యవహరించిన తీరు, కాశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వంపై ప్రతిపాదన తీవ్ర ఆశ్చర్యానికి గురి చేసింది. అరబ్ దేశాల పర్యటనలో ఉన్న ట్రంప్.. విదేశీ గడ్డపై మాట్లాడుతూ భారత్‌లో యాపిల్ కంపెనీ కార్యకలాపాలపై అసంతృప్తి వెళ్లగక్కిన తీరు కూడా ఆందోళనను, అనుమానాలను రేకెత్తించింది. ఈ క్రమంలో రోజురోజుకు రూపాయి విలువ పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మన ఆర్థిక వ్యవస్థ బలంగా లేదనడానికి ఇంతకన్నానిదర్శనం అక్కర్లేదు. గత కొన్ని మాసాలుగా రూపాయి పతనం వల్ల దిగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాగే విదేశీ మారక నిల్వలపై కూడా ప్రభావం పడుతోంది. రూపాయిని నిలబెట్టే చర్యలేవీ ప్రభుత్వం తీసుకోవడం లేదు. దీంతో ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగి, పేదలకు శరాఘాతంగా పరిణమిస్తోంది. డాలర్‌కు రూ.85.50 మధ్య మారకపు రేటు కొనసాగుతోంది. తాజాగా 86కు చేరువలో ఉంది.రిజర్వుబ్యాంక్ దగ్గర ఉన్న విదేశీ మారక నిల్వలను మార్కెట్ లోకి అదనంగా విడుదల చేసినప్పటికీ, రూపాయి విలువ పతనం ఆగడంలేదు. ఇబ్బడిముబ్బడిగా దిగుమతులు కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి. అలాగే జివిస్టీ పోటుతో దేశీయంగా ధరలు విపరీతంగా పెరుగుతూ పోతున్నాయి. దీనిని తగ్గించాలన్న డిమాండ్‌ను పట్టించు కోవడం లేదు. ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచే చర్యలేవీ చేయడం లేదు. రూపాయి విలువ డాలర్÷-తో పోల్చుకున్నప్పుడు అతి తక్కువకు పడిపోయింది. విదేశీ మారకద్రవ్యాన్ని వివిధ కరెన్సీలలో దాచుకుంటారు. ఆ విధంగా కొంత యూరోల రూపంలో దాచినది ఉంది. యూరో విలువ కూడా డాలర్ తో పోల్చినప్పుడు తగ్గింది. ఆ విధంగా కూడా మన విదేశీ కరెన్సీ నిల్వల విలువ డాలర్‌తో పోల్చి నప్పుడు తగ్గింది. రూపాయి విలువ పడిపోకుండా నిలబెట్టడానికి ఆర్‌బిఐ ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయినా కూడా రూపాయి విలువ పడిపోతోంది. రూపాయి విలువ పడిపోవడం అనేది సామాన్యులకు భారంగా మారింది. దేశీయంగా కఠినచర్యలు తీసుకుంటే ఈ దుస్థితిరాదు. రూపాయి విలువ పడిపోవడం కారణంగా పెట్రో దిగుమతులకు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. దాని వలన పెట్రోలు డీజిల, వంటగ్యాస్ ధరలు మరింత పెరుగుతున్నాయి. అది ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ఈ ద్రవ్యోల్బణం విదేశీ మార్కెట్‌లో రూపాయి విలువ మరింత పడిపోడానికి దారి తీస్తుంది. ఆ విధంగా ద్రవ్యోల్బణం కారణంగా రూపాయి విలువ పతనం అన్న చక్ర భ్రమణం సాగుతోంది. రూపాయి విలువ పడిపోవడం కారణంగా మన దిగుమతులు మరింత ప్రియం అవుతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమనే ప్రహసనం చివరికు ప్రజల కొనుగోలు శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విదేశీ విద్య మరింత భారం అవుతోంది. విదేశీ ప్రయాణాలు కూడా భారంగా మారుతున్నాయి. మొత్తంగా రూపాయి విలువ పడిపోవడం అనేది ప్రజల మీద మరింత పెద్ద దాడిగా పరిణమిస్తుంది. ఒకవేళ ఏదైనా తాత్కాలిక పరిణామం కారణంగా రూపాయి విలువ పడిపోతే, తిరిగి కొద్దికాలంలోనే మళ్ళీ కోలుకుని పెరిగే అవకాశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం రూపాయి విలువ పతనానికి కారణాలు వ్యవస్థీకృతమైనవిగా భావించాలి. విదేశీ చెల్లింపుల లోటు పెరిగిపోడానికి కారణం విదేశీ వ్యాపారంలో ఎగుమతులకన్నా దిగుమతుల విలువ ఎక్కువగా ఉండడం అని గుర్తించాలి. మన ఎగుమతులు పెరుగుతున్న వేగంతో పోల్చినప్పుడు దిగుమ మరోవైపు దిగుతులు ఇంకా వేగంగా పెరిగి పోతున్నాయి. అయితే దీనిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం తప్ప రూపాయి బలోపేతనాకి తీసుకుంటున్న చర్యలు కానరావడం లేదు.

గత ఆర్థిక సంవత్సరం 2024-25 జనవరి-మార్చి త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి 6.9 శాతంగా నమోదు కావొచ్చని ఇక్రా అంచనా వేసింది. 2024-25 మొత్తం మీద వృద్ధి 6.3 శాతంగా ఉండనుందని పేర్కొంది. ఫిబ్రవరిలో జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) అంచనా వేసిన 6.5 శాతం కంటే ఇది తక్కువ. జూన్, సెప్టెంబరు, డిసెంబరు త్రైమాసికాల్లో వృద్ధి వరుసగా 6.5 శాతం, 5.6 శాతం, 6.2 శాతంగా నమోదైంది. 2024-25లో ఎన్ఎస్ఓ వృద్ధి అంచనా 6.5 శాతాన్ని అందుకోవాలంటే, నాలుగో త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధిని సాధించాల్సి ఉంది.

మే 30న 2024-25 నాలుగో త్రైమాసికంతో పాటు- పూర్తి ఆర్థిక సంవత్సరానికి జీడీపీ గణాంకాలను ఎన్ఎస్ఓ ప్రకటించనుంది. గత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసికాల్లో వృద్ధి గణాంకాల్లో సవరింపులు ఉంటే తప్పా, వృద్ధి 6.3 శాతానికి పడిపోనుంది. 2023-24లో జీడీపీ వృద్ధి 9.2 శాతంగా నమోదైంది. నాలుగో త్రైమాసికంలో ప్రైవేట్ వినియోగం, పెట్టు-బడుల ధోరణులు సరిగ్గా లేవని, టారిఫ్ సంబంధిత అనిశ్చితులు ఇందుకు తోడయ్యాయని ఆర్థికవేత్తలు తెలిపారు.

# శ్రీవారి రథానికి ఎదురెళ్లి ముస్లింలు స్వాగతం...

కడప: వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగులో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో అద్భుతమైన మత సామరస్యం వెల్లివిరిసింది. హిందూ ముస్లిం భాయీభాయీ అంటూ నినాదాలు చేశారు. భక్తులకు మజ్జిగ, మిఠాయిలు పంచిపెట్టి తమ సద్భావనను చాటుకున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలు కన్నుల పండుగలా సాగుతున్నాయి.

శ్రీవారి ఉత్సవాల్లో మతసామరస్యం వెల్లివిరిసింది. వందల మంది ముస్లింలు ఉత్సవంలో పాల్గొని.. స్వామివారి రథంపై పూలవర్షం కురిపించారు. అరుదైన ఈ ఘటన వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగులో శనివారం చోటుచేసుకుంది. జమ్మలమడుగు పట్టణం నారాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శనివారం రథోత్సవం కన్నులపండవగా సాగింది. దాదాపు పదివేల మందికిపైగా భక్తులు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి రథం పట్టణంలోని పాత బస్టాండు వద్దకు చేరుకోగానే.. ముస్లింలు పెద్ద సంఖ్యలో ఎదురొచ్చారు.

మదర్సాల బోధకులు, ముస్లిం సోదరులు భక్తులకు ఎదురేగి గులాబీలు అందజేశారు. పూలు చల్లుతూ వారికి స్వాగతం పలికారు. అంతేకాదు, హిందూ ముస్లిం భాయీభాయీ.. మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, మిఠాయిలు పంచిపెట్టారు. దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీకి చెందిన పలు స్థానిక ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు మే 11 నుంచి ప్రారంభమయ్యాయి. అందులో భాగంగానే దేశ రాజధాని న్యూఢిల్లీ, ఉత్తరాఖండ్ డెహ్రాడూన్ సమీపంలోని రిషికేశ్ వద్ద ఆంధ్రా ఆశ్రమంలో ఉన్న శ్రీవారి ఆలయం, జమ్మలముడుగు, నారాయణవనం పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి సహా పలు ఆలయాల్లో ఉత్సవాలు జరుగుతున్నాయి.

మే 11న ఆదివారం సాయంత్రం టీటీడీకి చెందిన అన్ని వేంకటేశ్వర స్వామి అలయాల్లోనూ సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ వైఖానస ఆగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టం జరిగింది. ముందుగా ధ్వజస్తంభం వద్ద విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు ఆలయాల్లో వాహన సేవలు నిర్వహిస్తున్నారు. తిరుమలలో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల మాదిరిగానే టీటీడీకి అనుబంధంగా ఉన్న ఈ ఆలయాల్లోనూ ఉత్సవాలు ఏటా నిర్వహిస్తుంటారు. తిరుమలలో జరిగే ఉత్సవాలను వీటిల్లోనూ జరిపిస్తుంటారు. ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొంటారు.

# భారీగా తగ్గిన బీరు ధరలు..

ఆంధ్రప్రదేశ్: బీర్ ప్రియులకు ఇది నిజంగా శుభవార్తే! భారత్, బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో కొన్ని బ్రిటన్ బీర్ బ్రాండ్ల ధరలు తగ్గనున్నాయి. పన్నులు తగ్గడం వల్ల యూకే బీర్ల ధరలు రూ.20 నుంచి రూ.35 వరకు తగ్గే అవకాశం ఉంది. అయితే, ఈ తగ్గింపు ఎంపిక చేసిన బ్రాండ్లకే పరిమితం కానుంది. వేసవిలో మన దగ్గర బీర్ల అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఇక ధర తగ్గితే అమ్మకాలు మరింత పుంజుకుంటాయి అంటున్నారు.

సాధారణంగానే రెండు తెలుగు రాష్ట్రాల్లో.. మరీ ముఖ్యంగా తెలంగాణలో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరుగుతుంటాయి. పండగలు, న్యూఇయర్ వంటి ప్రత్యేక సందర్భాల్లో ఈ రికార్డులు బ్రేక్ అవుతుంటాయి కూడా. ఇక ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభం అయిన దగ్గర నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే.. ఈ ఏడాది అమ్మకాలు భారీగా పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీరు ప్రియులకు భారీ శుభవార్త చెప్పారు. బీర్ల ధరలు దిగి వచ్చాయి. ఆ వివరాలు..

బీర్ ప్రియులకు ఇది మంచి కిక్కిచ్చే వార్త అని చెప్పవచ్చు. కారణం రెండు తెలుగు రాష్ట్రాల్లో బీర్ ధరలు తగ్గనున్నాయి. అయితే ఈ తగ్గుదల కొన్ని బ్రాండ్లకు మాత్రమే పరిమితం కానుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన బీర్ బ్రాండ్ల మధ్య విపరీతమైన పోటీ నడుస్తోంది. అమ్మకాలు పెంచుకొనేందుకు అనేక కొత్త ప్రయోగాలు చేస్తున్నాయి. పైగా రెండు రాష్ట్రాల్లోనూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి.

తాజా నిర్ణయంతో బీర్ల రేట్లు తగ్గి.. అమ్మకాలు రెటట్టింపు అయ్యే అవకాశం ఉంది అంటున్నారు. ఇంతకు ఆ నిర్ణయం ఏంటంటే.. భారత్, బ్రిటన్ మధ్య జరిగిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం. దీని వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక.. దేశవ్యాప్తంగా బీర్ల ధరలు తగ్గనున్నాయి. ఈ తగ్గింపు పైన నిపుణులు స్పష్టత ఇస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో బీర్ అమ్మకాలు ప్రతీ నెలా పెరుగుతునే ఉన్నాయి. ఇక వేసవిలో బీర్ అమ్మకాలకే ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఐదు ప్రధాన బీర్ బ్రాండ్లకు ఇక్కడ భారీ డిమాండ్ ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే రూ .99లకే క్వార్టర్ మద్యం అమ్మకాలు ప్రారంభం అయిన తర్వాత.. తెలుగు రాష్ట్రాల్లో.. బీర్ విక్రయాలు కొంతమేర తగ్గాయి. అయితే వేసవి ప్రారంభం అయిన దగ్గర నుంచి అంచనాలకు అనుగుణంగా అమ్మకాలు పెరిగాయి. ఇక.. ఇప్పుడు భారత్, బ్రిటన్ మధ్య జరిగిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల.. బీర్ ధరలు మరింత తగ్గనున్నాయి. ఈ ఒప్పందం వల్ల బ్రిటన్ బీర్‌పై పన్ను ఏకంగా 75 శాతం తగ్గింది. దీని కారణంగా యూకే మేడ్ బీర్ల ధరలు మన దగ్గర భారీగా తగ్గనున్నాయి.

తాజా ఒప్పందం వల్ల ఎంపిక చేసిన బ్రిటన్ బీర్ బ్రాండ్లు ఇండియాలో చాలా చౌకగా లభిస్తాయి. ఒప్పందం ముందు వరకు కూడా మన దగ్గర రూ.200 ఉన్న బ్రిటన్ బీర్ ధక తగ్గుముఖం పట్టనుంది. అయితే .. ఏకంగా ఓ బీరు బాటిల్.. కేవలం రూ 50 కే అందుబాటులోకి వస్తుందనేది మాత్రం వాస్తవం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాకపోతే ఒక్కో బీరు మీద రూ. 20-రూ. 35 వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

2024 లో భారతీయ బీర్ మార్కెట్ విలువ దాదాపు రూ.50,000 కోట్లు. ఇది ప్రతి సంవత్సరం సగటున 8-10శాతం వృద్ధి రేటును కలిగి ఉంది. కేంద్రం ఒప్పందం చేసుకున్నా.. ప్రతీ రాష్ట్రం తమ సొంత ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ పన్నును ఖరారు చేస్తుంది. దీంతో, యూకే బ్రాండ్ల బీర్ ధరలు మాత్రం తగ్గనున్నాయి.

# కొత్తగా పెళ్లైన వారు రేషన్ కార్డుకు అప్లై చేస్తున్నారా..



ఆంధ్రప్రదేశ్: కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రభుత్వం ఒక ముఖ్యమైన ప్రకటన చేసింది. ఇకనుండి రేషన్ కార్డు కోసం అప్లై చేసేవారు ఆధార్‌తో పాటు వివాహ ధ్రువపత్రం కూడా జత చేయాలట. దీనికోసం పెళ్లికార్డులు వెతికే పనిలో పడ్డారు చాలామంది. అసలు ఈ మ్యారేజ్ సర్టిఫికెట్ ఎలా పొందాలి? ఒకవేళ పెళ్లి చేసుకుని చాలా కాలం ఐతే పరిస్థితి ఏంటి? కొన్ని వర్గాల ప్రజలు ఎందుకు ఆందోళన చెందుతున్నారు? ఈ నిబంధన నుండి మినహాయింపు ఉంటుందా అనే ప్రశ్నలకు సమాధానం ఇక్కడ..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుంది. గ్రామ వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తు ఈ ప్రక్రియ కొనసాగుతోంది. లక్షల మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న వారికి ఏపీ ప్రభుత్వం కీలక అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా పెళ్లై రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారు.. ఆధార్‌తో పాటు వివాహ ధ్రువపత్రం జతచేసి సచివాలయాల్లో అందజేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది.

అయితే మ్యారేజ్ సర్టిఫికేట్ పొందాలంటే.. పెళ్లికార్డు ఉండాలి. అలాగే దరఖాస్తుకు జత చేసేందుకు కూడా పెళ్లి కార్డు కావాలి. దీంతో చాలామంది మళ్లీ శుభలేఖలను ప్రింటింగ్ చేయించుకుంటున్నారు.

**మ్యారేజ్ సర్టిఫికేట్ ఎలా పొందాలంటే..**

వివాహ ధ్రువీకరణ పత్రం పొందాలంటే.. అప్లై చేసే సమయంలో దరఖాస్తు ఫారానికి భార్యాభర్తల ఆధార్ కార్డు, వయసు నిర్ధారణ ధ్రువీకరణ పత్రం, శుభలేఖ, వివాహ సమయంలో తీసుకున్న ఫొటోలు, ముగ్గురు సాక్షులు, కల్యాణ మండపం రసీదు వంటి డాక్యుమెంట్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ఆలయంలో పెళ్లి చేసుకుంటే.. దేవాలయం వారు ఇచ్చే రిజిస్ట్రేషన్ పత్రం, రూ.500 చలానా జత చేసి సబ్‌రిజిస్ట్రార్‌కు దరఖాస్తు సమర్పించాలి. వారు వివరాలను పరిశీలించి.. అన్నీ కరెక్ట్‌గా ఉంటే.. గంట వ్యవధిలో వివాహ ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తారు.

**సచివాలయాల్లో ఎలా పొందాలంటే..**

గ్రామాల్లో, పట్టణాల్లో వివాహం చేసుకునే వారు పెళ్లి అయిన వెంటనే సచివాలయాల్లో మ్యారేజ్ సర్టిఫికేట్ కోసం అప్లై చేసుకుంటే మంచిది. అక్కడ వెంటనే మంజూరు చేస్తారు. వివాహం జరిగిన వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే.. అన్ని వివరాలను పరిశీలించి అక్కడే ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారు. కానీ గడువు దాటిన వారు మాత్రం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచే పొందాల్సి ఉంటుంది. మ్యారేజ్ సర్టిఫికేట్ పొందాలంటే..ఫొటోలు, ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు, పురోహితుడి ధ్రువీకరణ, చలానా చెల్లింపు ఇలా.. మొత్తంగా రూ.1000 వరకు ఖర్చవుతోంది. దీనికి అదనంగా కొందరు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారుల దందాలకు పాల్పడు తూ.. ప్రజల వద్ద రూ.3 వేలకు పైగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ముస్లిం, క్రిస్టియన్లలో ఆందోళన..**

హిందువులు మ్యారేజ్ సర్టిఫికేట్ పొందాలంటే.. డాక్యుమెంట్స్ అన్నీ సరిగా ఉంటే.. రోజుల వ్యవధిలో పని పూర్తవుతుంది. కానీ ముస్లిం, క్రైస్తవులు వివాహ ధ్రువీకరణ పత్రం పొందాలంటే.. తక్కువలో తక్కువ రెండు నెలల సమయం పడుతుంది. ముస్లిం, క్రిస్టియన్లు.. మ్యారేజ్ సర్టిఫికేట్‌కు అప్లై చేసుకుంటే.. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను నెల రోజుల పాటు.. నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. దీనిపై ఎటువంటి అభ్యంతరాలు రాకుంటే అప్పుడు ధ్రువీకరణ పత్రం ఇస్తారు. కానీ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం జూన్ 7 వరకు మాత్రమే ఉంది. దీంతో ముస్లిం, క్రిస్టియన్ వర్గాల ప్రజలు ఆందోళణ వ్యక్తం చేస్తున్నారు.

**మినహాయింపునకు అవకాశం ఉందా..**

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు వివాహ రిజిస్ట్రేషన్ పత్రం నుంచి ప్రభుత్వం మినహాయింపు నిచ్చే అవకాశం ఉందని.. డీఎస్‌వోలు చెబుతున్నారు. ఇటీవల పౌరసరఫరాల కమిషనర్‌తో జరిగిన సమావేశంలో ఈ సమస్యను మంత్రి నాదెండ్ల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రత్యామ్నాయంగా శుభలేఖ, ఫొటో వంటి ఆధారాలు తీసుకునేలా సడలింపు ఇస్తామని తెలిపారు. అయితే దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో దరఖాస్తుదారులు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు.

అయితే ఒక కుటుంబంలో ఉంటూ వేరు కాపురం వెళ్లిన వారు.. తమ కార్డులను విభజించుకోవాలనుకుంటారు. అలాంటి వారి కోసం స్ప్లిట్టింగ్ అవకాశం కల్పిస్తున్నారు. అయితే వారు మాత్రం మ్యారేజ్ సర్టిఫికేట్ ఇవ్వాల్సిన అవసరం లేదని అంటున్నారు. అయితే కొత్తగా పెళ్లైన దంపతులు మాత్రం వివాహ ధ్రువీకరణ పత్రం తీసుకోవడం మంచిదని.. ఎప్పటికైనా ఉపయోగమే అంటున్నారు.

# హెలీప్యాడ్, లగ్జరీ హోటల్స్ సహా కళ్లుచెదిరేలా..



తిరుపతి: తిరుపతిలో రూ.500 కోట్ల వ్యయంతో అత్యాధునిక బస్టాండ్ నిర్మాణం కానుంది. తిరుమల ఆలయాన్ని ప్రతిబింబించేలా దీని డిజైన్ ఉంటుంది. మొత్తం 10 అంతస్తుల్లో నిర్మితమయ్యే ఈ భవనంలో బస్టాండ్‌తో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలు ఇందులో అందుబాటులో ఉంటాయి. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ స్థలాన్ని ఇవ్వనుండగా, కేంద్ర ప్రభుత్వ సంస్థ పెట్టుబడి పెడుతుంది. ప్రయాణికుల కోసం తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేయనున్నారు. రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు స్కైవాక్ నిర్మించాలని యోచిస్తున్నారు.

కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవారి దర్శనం కోసం ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్నీ సౌకర్యాలు ఒకేచోట లభించేలా తిరుపతిలో కోసం కొత్త బస్టాండ్ రాబోతోంది. ప్రస్తుత బస్టాండ్ స్థానంలోనే అత్యాధునిక అల్ట్రా మోడల్ బస్ టెర్మినల్ నిర్మించనున్నారు. భక్తులకు అన్ని వసతులు ఒకే చోట అందించేలా ఇది ఉంటుంది. దాదాపు రూ.500 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందులో బస్టాండ్‌తో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలు కూడా ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ స్థలాన్ని ఇవ్వనుండగా,.. కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ కొంత పెట్టుబడి పెడుతుంది. ప్రైవేటు సంస్థ ద్వారా మిగిలిన నిధులను సమకూరుస్తారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని ప్రతిబింబించేలా దీని డిజైన్ ఉంటుంది.

ప్రస్తుతం ఉన్న తిరుపతి బస్టాండ్ 13.18 ఎకరాల్లో ఉంది. కొత్త టెర్మినల్‌ను 12.19 ఎకరాల్లో నిర్మిస్తారు. ప్రస్తుత బస్టాండ్‌కు మూడు వైపులా రోడ్లు ఉన్నాయి. కొత్త టెర్మినల్‌కు మాత్రం నాలుగు వైపులా రోడ్లు ఉండేలా డిజైన్ చేశారు. కొత్త బస్టాండ్‌లో రెండు అంతస్తుల సెల్లార్ ఉంటుంది. ఈ సెల్లార్‌లో బైక్‌లు, కార్లు పార్కింగ్ చేయడానికి ఉపయోగిస్తారు. గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం బస్టాండ్‌కు కేటాయిస్తారు. ఇక్కడ 98 ప్లాట్‌ఫామ్‌లతో పెద్ద బస్టాండ్ ఉంటుంది. అంతేకాదు, 50 బస్సులు పార్కింగ్ చేయడానికి, ఎలక్ట్రిక్ బస్సుల ఛార్జింగ్ కోసం కూడా ఏర్పాట్లు చేస్తారు.

మొదటి, రెండో అంతస్తుల్లో కొంత భాగాన్ని కార్యాలయాలకు ఇస్తారు. మిగిలిన స్థలంలో ఫుడ్‌కోర్టులు, దుకాణాలు ఉంటాయి. మూడో అంతస్తును సర్వీసుల కోసం వదిలేస్తారు. అంటే భవనానికి సంబంధించిన విద్యుత్ పనులు, సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ వంటివి ఇక్కడ ఉంటాయి. నాలుగు నుంచి ఏడో అంతస్తు వరకు హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలు, ఇతర వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తారు. ఎనిమిది, తొమ్మిది, పదో అంతస్తుల్లో బ్యాంకులు, ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థల కార్యాలయాలు ఉంటాయి. పదో అంతస్తు పైన హెలికాప్టర్ దిగడానికి హెలిప్యాడ్ కూడా నిర్మిస్తారు. మొత్తం మీద 1.54 లక్షల చదరపు అడుగుల మేర బిల్డింగ్ ఉంటుంది.

ఈ ప్రాజెక్టులో విలువైన స్థలాన్ని ఇస్తున్నందున పెట్టుబడి పెట్టడం లేదు. కొంత, కాంట్రాక్ట్ సంస్థ కొంత పెట్టుబడి పెడతాయి. ప్రాజెక్టు పూర్తయ్యాక హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలు, బ్యాంకులు, కార్యాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కాంట్రాక్టర్ సంస్థ పంచుకుంటాయి. ఎవరికి ఎంత వాటా వస్తుందనేది ఒప్పందం చేసుకుంటారు.

బస్టాండ్ నిర్మాణం జరిగే సమయంలో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూస్తారు. ప్రస్తుత బస్టాండ్‌ను రెండు, మూడు చోట్లకు మారుస్తారు. కొన్ని బస్సులను మంగళం డిపోకి పంపుతారు. అలిపిరి దగ్గర టీటీడీ స్థలం, తిరుచానూరు మార్గంలో కొన్ని చోట్ల తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేస్తారు. తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తుల కోరిక మేరకు ఈ బస్ టెర్మినల్ నిర్మాణం చేస్తున్నారు. డిజైన్ బాధ్యతను రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్‌కు అప్పగించారు. శ్రీవారి ఆలయాన్ని ప్రతిబింబించేలా డిజైన్‌కు రూపకల్పన చేశారు. ముఖద్వారం తిరుమల ఆలయాన్ని తలపించేలా రూపొందించారు. రైల్వే స్టేషన్ నుంచి నేరుగా బస్టాండ్‌కు వెళ్లడానికి కిలోమీటరు మేర స్కైవాక్ నిర్మించాలని కూడా ఆలోచిస్తున్నారు.

# ఈ కానిస్టేబుల్ యమకంత్రీ.. ప్రేమికులే టార్గెట్..



కడప: అతడో కానిస్టేబుల్. కానీ చేసేవి మాత్రం పక్కా కంత్రీ పనులే. ప్రేమికులు కనిపిస్తే చాలు.. పూనకాలు వచ్చినట్లు ఊగిపోతాడు. తన చేతికి పని చెబుతాడు. తన అనుచరుడితో కలిసి.. కనిపించిన ప్రేమ జంటలను బెదిరించేవాడు. ఆ తర్వాత వారి నుంచి అందినకాడికి డబ్బులు వసూలు చేసేవాడు. అయితే వీరిద్దరి వేధింపుల కారణంగా.. ఓ బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. అనుచరుడిని అరెస్ట్ చేయగా అసలు బండారం బయటపడింది. ఆ కానిస్టేబుల్ పాత్ర బయటికి రావడంతో అతడ్ని సస్పెండ్ చేశారు.

కడప జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామ్మోహన్ రెడ్డి.. ఏకాంతంగా ఉన్న లవర్స్‌ను టార్గెట్‌గా చేసుకుని.. డబ్బులు దండుకోవడం.. ఒక ప్రాణాన్ని బలి తీసుకుంది. ప్రేమికులు కలిసి ఉండగా ఫోటోలు తీసి.. వారిని డబ్బులు డిమాండ్ చేసేవాడు. ఎక్కడైనా ప్రేమజంట కనిపిస్తే చాలు వారిని భయపెట్టి అందినకాడికి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నాడు. ఈ దోపిడీకి ఒక అనుచరుడు కూడా ఉన్నాడు. అనిల్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి.. తాను కానిస్టేబుల్ అంటూ చెప్పుకుని తిరుగుతున్నాడు. వీరిద్దరూ కలిసి ప్రేమికులను భయపెట్టి, బెదిరించి, వేధింపులకు గురి చేసే మరీ డబ్బులు వసూలు చేసుకుంటున్నారు. అయితే ఆ వేధింపులకు ఓ బీటెక్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడటంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది. తాజాగా అన్నమయ్య జిల్లా రాజంపేట పోలీసులు అనిల్ కుమార్ రెడ్డిని అరెస్ట్ చేయగా.. ఆ తర్వాత రామ్మోహన్ రెడ్డిని సస్పెండ్ చేశారు.

కడప ఏఆర్ విభాగంలో కె. రామ్మోహన్ రెడ్డి అనే వ్యక్తి కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ప్రొద్దుటూరుకు చెందిన తన బంధువు అనిల్ కుమార్ రెడ్డిని పాలకొండల్లో అనధికారికంగా నియమించుకున్నాడు. దీంతో అక్కడికి వచ్చే ఒంటరి మహిళలు, ప్రేమజంటలను టార్గెట్ చేస్తూ అనిల్ కుమార్ రెడ్డి ఫోటోలు తీసి, వారి ఫోన్ నంబర్లు తీసుకుని వివరాలు రామ్మోహన్ రెడ్డికి పంపేవాడని తెలుస్తోంది. వెంటనే రామ్మోహన్ రెడ్డి పాలకొండలకు వచ్చి వారికి ఫోటోలు చూపించి భయపెట్టడంతో పాటు వారి తల్లిదండ్రులకు చెబుతానని భయపెట్టి.. అందినకాడికి దోచుకునేవాడని పోలీసుల విచారణలో తేలింది.

ఈ క్రమంలోనే అనంతపురం జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన ఫ్రెండ్స్‌తో కలిసి పాలకొండలకు వెళ్లింది. వారి ఫోటోలు అనిల్ తీయగా.. రామ్మోహన్ రెడ్డి వెళ్లి భయపెట్టాడు. దీంతో వారు రూ.4 వేలు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత మళ్లీ వేధింపులకు గురి చేయడంతో మరో రూ.10 వేలు ఇచ్చారు. అయినా ఆశ తీరని రామ్మోహన్ రెడ్డి.. ఇంకా డబ్బుల కోసం ఒత్తిడి చేయడంతో ఫిబ్రవరి 5వ తేదీన ఆ యువతి.. తాను ఉంటున్న లేడీస్ హాస్టల్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

డబ్బులు ఇవ్వకపోవడంతో అనిల్ కుమార్ రెడ్డి.. ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆమె మనస్తాపానికి గురై ప్రాణాలు తీసుకుంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. అనిల్ కుమార్ రెడ్డిన అరెస్ట్ చేశారు. విచారణలో అతను చెప్పిన దాని ప్రకారం ఏఆర్ కానిస్టేబుల్ రామ్మోహన్ రెడ్డి పేరు బయటికి వచ్చింది. దీంతో అసలు నిజాలు బయటపడ్డాయి. దీంతో కడప జిల్లా ఎస్పీ.. కానిస్టేబుల్ రామ్మోహన్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

# బైక్ మీద వెళ్తూనే రెచ్చిపోయిన లవర్స్

విజయవాడ: ఓ జంట చేసిన పని అందరినీ విస్తుపోయేలా చేసింది. ఫ్లై ఓవర్ పై బైక్ నడుపుతూనే అసభ్యకరంగా ప్రవర్తించారు. మద్యం మత్తులో ఉన్న ఆ జంట రోడ్డుపై రొమాన్స్ చేస్తూ రెచ్చిపోయారు. వారి వికృత చేష్టలను చూసిన కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది. నెటిజన్లు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు గతంలోనూ జరిగాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరి కోసం గాలిస్తున్నారు.

కామంతో కళ్లు మూసుకుపోయిన వారికి ఇల్లు, రోడ్డు, నలుగురిలో ఉన్నాం.. సిగ్గు, శరం లాంటివి పెద్దగా గుర్తుకు రావు. వారికి తెలిసిందల్లా.. ఆ సమయంలో వారి కోరిక తీర్చుకోవడమే. అందుకు ఎంతకైనా బరితెగిస్తారు.. తాజాగా ఇందుకు నిదర్శనంగా నిలిచే సంఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. మద్యం మత్తులో కళ్లు మూసుకుపోయిన ఓ ప్రేమ జంట.. నడి రోడ్డు మీద.. అది కూడా డ్రైవింగ్‌లో ఉన్నామనే సంగతి మర్చిపోయి మరీ రెచ్చిపోయి రొమాన్స్ చేసుకోసాగారు. వారి కంటే ఇంగితం లేకపోవచ్చు కానీ చూసేవారు అందరూ అలానే ఉండరు కదా. అందుకే ఆ దరిద్రాన్ని చూడలేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వివరాలు..



ఈ సంఘటన విజయవాడ రామలింగేశ్వర నగర్ ఫ్లై ఓవర్ వద్ద వెలుగు చూసింది. ఓ ప్రేమ జంట బైక్ మీద ఆ రోడ్డులో వెళ్తూ.. సభ్య సమాజం తలదించుకునే విధంగా ప్రవర్తించారు. బైక్ మీదే బరి తెగించి.. రొమాన్స్ చేసుకోవడం ప్రారంభించారు. పైగా వారిద్దరూ మద్యం మత్తులో ఉన్నారని అర్థం అవుతోంది. బైక్‌ను కూడా అతి వేగంగా నడిపారు. ఇక వీడియోలో ఉన్న దాని ప్రకారం.. ప్రియుడు బైక్ నడుపుతుంటే.. అతగాడి గర్ల్ ఫ్రెండ్.. బైక్ మీద.. అతడి ముందు పెట్రోల్ ట్యాంక్‌పై కూర్చుంది. పక్కనే మరి కొన్ని కార్లు, బైక్‌లు కూడా వెళుతున్నాయి. వారిని పట్టించుకోకుండా.. రొమాన్స్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇక రోడ్డు మీద ఉన్న వారైతే అసహ్యంతో ముఖం తిప్పుకున్నారు. ఎందరు చీదరించుకున్న ఈ గలీజ్ కపుల్ మాత్రం ఎవరిని పట్టించుకోకుండా తమ పనిలో మునిగిపోయారు. వీరి వికృత చేష్టలను గమనించిన మరో బైకర్ ఈ తతంగమంతా వీడియో తీశాడు. దీన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో.. వైరల్ అవుతోంది. దీనిపై నెటిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ఇంత కక్కుర్తి ఏంట్రా నాయనా.. చిత్త కార్తె కుక్కలకన్నా దారుణంగా ఉన్నారంటూ తిట్టి పోస్తున్నారు.

అయితే ఇలాంటి సంఘటనలు జరగటం ఇదేం కొత్త కాదు.. ఇదే విశాఖపట్నంలో గతంలో కూడా ఓ జంట ఇలానే చెత్త పనులు చేస్తూ.. దొరికిపోయారు. అలానే గతంలో బిహార్‌లో కూడా ఓ జంట ఇలానే రోడ్డుపై బైక్ మీద అసభ్యకరంగా ప్రవర్తించిన వీడియో తెగ వైరల్ అయింది.

చుట్టుప్రక్కల మనుషులను పట్టించుకోకుండా.. ఏకంగా మీదే రెచ్చిపోయారు. ఈ సంఘటనను స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియోలో పోస్ట్ చేశారు. ఇక మెట్రో స్టేషన్ లిఫ్ట్‌లను కూడా వదలడం లేదు ఈ కామంధులు.

# అమరావతి నిర్మాణంలో దేశంలోనే తొలిసారి..!



ఆంధ్రప్రదేశ్: రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రకృతికి ఎలాంటి హాని చేయకూడదని భావించిన చంద్రబాబు సర్కార్.. చెట్లను తొలగించి.. వాటిని మళ్లీ ఇతర ప్రాంతాల్లో నాటుతోంది. దీనివల్ల ప్రకృతికి ఎలాంటి నష్టం జరగదని భావిస్తోంది. అమరావతిని హరిత నగరంగా మార్చడంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం.. అమరావతే రాజధాని అని తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవాన్ని ఇటీవలె ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా వచ్చి మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే శరవేగంగా రాజధాని నిర్మాణాన్ని చేపట్టేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే అమరావతి రాజధానిని హరిత నగరంగా మార్చేందుకు నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి సర్కార్.. వినూత్న ప్రయత్నం చేస్తోంది. దేశంలోనే తొలిసారి ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్, ట్రీ ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిని చేపడుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా అమరావతిని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలోనే దేశంలోనే తొలిసారిగా భారీ ఎత్తున ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కార్యక్రమానికి చంద్రబాబు సర్కార్ చర్యలు చేపట్టింది. ఈ ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రక్రియలో భాగంగా రోడ్ల నిర్మాణాలకు అడ్డుగా ఉన్న వందలాది చెట్లను ఉన్న ప్రాంతం నుంచి తీసి.. సురక్షితంగా మరో చోటుకు తరలించి అక్కడ మళ్లీ నాటుతోంది. దీని వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని భావిస్తోంది.

సాధారణంగా రోడ్ల విస్తరణ లేదా మరేదైనా అభివృద్ధి పనులు చేస్తున్నారంటే.. ఆ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికివేస్తూ ఉంటారు. అయితే ఇలా భారీ ఎత్తున చేపట్టే అభివృద్ధి పనుల్లో చెట్లను నరికేయడం ద్వారా.. పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ క్రమంలోనే పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు.. చెట్లను నరికివేయకుండా ట్రీ ట్రాన్స్‌లొకేషన్ పద్ధతి ద్వారా వాటిని సురక్షితంగా తరలించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియలో భాగంగానే చెట్ల కొమ్మలను కత్తిరించి.. చెట్టు మొదట్లో చుట్టూ తవ్వి కొంతమేర వేళ్లను కత్తిరిస్తారు. ఆ తర్వాత వేరు వ్యవస్థ కుళ్లిపోకుండా దానికి ఫంగల్ ట్రీట్‌మెంట్ కూడా ఇస్తారు. వేరు చుట్టూ ఉన్న మట్టితో సహా చెట్టును క్రేన్ సహాయంతో పైకి లేపి.. చుట్టూ గోనె సంచిని చుడతారు. ఆ తర్వాత.. అక్కడ తీసిన చెట్లను తుళ్లూరు మండలం అనంవరంలోని ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌కు తరలిస్తారు. ఆ సెంటర్‌లో పెద్ద ప్లాస్టిక్ సంచుల్లో కోకోపిట్, ఎర్రమట్టి, ఎరువులు కలిపిన మిశ్రమాన్ని నింపి, డ్రిప్ ద్వారా నీటి తడులను ఆ చెట్లకు అందిస్తారు. సాధారణంగా ఈ పద్ధతిలో చెట్లు బతికే అవకాశం 40 శాతం మాత్రమే ఉంటుంది. అయితే ప్రత్యేక చర్యలు చేపట్టడం ద్వారా 85 శాతం వరకు చెట్లను కాపాడే అవకాశాలు ఉంటాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇలా కొన్నిరోజులు సంరక్షించ బడిన వేలాది చెట్లను అమరావతిలోని గ్రీన్ జోన్లలో నాటేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అమరావతిని పచ్చని నగరంగా తీర్చిదిద్దడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం చాటి చెప్పనుందని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ పేలుళ్లకు కుట్ర..

## ఇద్దరు అరెస్ట్

హైదరాబాద్: హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర పన్నిన ఇద్దరిని తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. విజయనగరానికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్ నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఉగ్రదాడులు జరిగిన నేపథ్యంలో ఈ కుట్రను పోలీసులు తీవ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

హైదరాబాద్ నగరంలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నిన ఇద్దరు వ్యక్తులను తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు అలర్ట్ అయిన పోలీసులు.. విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు నిందితులను రహస్య ప్రదేశంలో ఉంచి లోతుగా విచారిస్తున్నారు. పేలుళ్లకు పథకం వేయడానికి గల కారణాలు, దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు, ఉగ్రవాద సంస్థలతో వారికి సంబంధాలు ఉన్నాయా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

గతంలో హైదరాబాద్‌లో ఉగ్రవాద దాడులు జరిగిన నేపథ్యంలో, ఈ కుట్రను పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ అరెస్టుతో నగర ప్రజలు కొంత ఆందోళన చెందుతున్నప్పటికీ, తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం అప్రమత్తంగా ఉందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులు భరోసా ఇచ్చారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఎలాంటి దుష్ప్రచారాలను నమ్మవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని అధికారులు స్పష్టం చేశారు. కాగా, పహల్గాం దాడి, ఆపరేషన్ సింధూర్ తర్వాత జరిగిన పరిణామాలతో ఉగ్రవాదుల పేర్లు వింటేనే జనం హడలిపోతున్నారు. ఇలాంటి సమయంలో



హైదరాబాద్ నగరంలో పేలుళ్లకు కుట్ర జరగటం ఆందోళనలకు గురి చేస్తోంది.

ఇక భారత సైన్యం పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందంపై స్పష్టమైన ప్రకటన చేసింది. మే 10న ఇరు దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందానికి నిర్దిష్టమైన గడువు ఏదీ లేదని, ఇది నిరంతరంగా కొనసాగుతుందని తేల్చి చెప్పింది. మే 18 సాయంత్రం 5 గంటలకు కాల్పుల విరమణ ముగుస్తుందం టూ వస్తున్న వార్తలను సైన్యం ఖండించింది. కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ అనంతరం ఇరు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. ఆ తర్వాత కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. భారత, పాకిస్థాన్ సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్స్ మధ్య మే 12న జరిగిన హాట్‌లైన్ సంభాషణల ప్రకారం, ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని భారత సైన్యాధికారి ఆదివారం స్పష్టం చేశారు. ఇది తాత్కాలిక ఏర్పాటు మాత్రమేననే ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు.



# పాతబస్తీ అగ్ని ప్రమాదం.. విధి ఆడిన వింత నాటకం

హైదరాబాద్: పాతబస్తీ గుల్జార్ హౌస్‌లో తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. చుట్టాల ఇంటికి వచ్చిన బెంగాల్‌కు చెందిన నాలుగు కుటుంబాలు ఈ దుర్ఘటనలో బలయ్యాయి. విధి ఆడిన వింత నాటకంలో అనుకోకుండా ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లోని పాతబస్తీలో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇవాళ తెల్లవారుజామున చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదం నగరంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనలో 17 మంది దుర్మరణం చెందగా.. పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ హృదయ విదారక ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

కాగా, ఈ ప్రమాదంలో ఓ బాధాకర విషయం వెలుగులోకి వచ్చింది. విధి ఆడిన వింత నాటకంలో నాలుగు కుటుంబాలు బలయ్యాయి. చుట్టాల ఇంటికి వచ్చి అనంతలోకాలకు చేరకున్నారు. అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారు ఇటీవల తమ బంధువుల ఇంటికి పశ్చిమ బెంగాల్ నుండి వచ్చినట్లు తెలిసింది. ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువ మంది బెంగాల్ రాష్ట్రానికి చెందిన వారే ఉన్నారని సమాచారం. ప్రమాదం జరిగిన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓ వ్యక్తి నగల దుకాణం నిర్వహిస్తుండగా.. అతడి ఇంటికి బెంగాల్ నుంచి నాలుగు కుటుంబాలకు చెందిన చుట్టాలు వచ్చారు. గత రాత్రి మొదటి అంతస్తులో నిద్రపోయిన బంధువుల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు.

కాగా, అగ్ని ప్రమాదానికి గల కారణం గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుకాణంలో గల ఎయిర్ కండీషనర్ కంప్రెసర్ పేలడమేనని ప్రాథమికంగా అగ్నిమాపక శాఖ అధికారులు అంచనాకు వచ్చారు. దీని కారణంగా విషపూరితమైన వాయువులు, దట్టమైన పొగ, మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఈ మంటల్లో చిక్కుకున్న వారంతా ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ముగ్గురు వ్యక్తులు ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు, మిగిలిన వారు పురుషులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# సాలర్‌జంగ్‌లోకి ఫ్రీ ఎంట్రీ.. టికెట్ అవసరం లేదు..

హైదరాబాద్: వేసవి సెలవుల్లో పిల్లలతో సరదాగా గడిపేందుకు హైదరాబాద్ నగరవాసులకు సాలార్ జంగ్ మ్యూజియం గొప్ప అవకాశం కల్పిస్తోంది. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా మే 16 నుంచి 21 వరకు ఉచిత ప్రవేశం కల్పించారు. సందర్శకులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మ్యూజి యాన్ని సందర్శించవచ్చు. అంతేకాకుండా, భారత స్వాతంత్ర్యానికి సంబంధించిన 75 వస్తువుల ప్రదర్శన, బిద్రి తయారీపై వర్క్‌షాప్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.



వేసవి సెలవులు వచ్చేశాయి. పట్టణాల్లో ఉన్న వారు పల్లె బాట పడితే.. గ్రామాల్లో ఉన్న వారు.. హైదరాబాద్‌లోని బంధువుల ఇళ్లకు చేరుకుంటు న్నారు. ఇక పిల్లల ఎంజాయ్‌మెంట్ గురించి చెప్పాల్సిన పని లేదు. ఇక ఈ సెలవుల్లో పిల్లలను పట్టుకోవడం తల్లిదండ్రుల వల్ల కాదు. వారి అల్లరితో టాప్ లేచిపోతుంది. మరి ఈ సెలవుల్లో పిల్లలను ఎంటర్‌టైన్ చేయాలంటే నగరంలో అనేక పర్యాటక ప్రాంతాలున్నాయి. అక్కడకు వెళ్తే వారికి సరదాగా ఉండటమే కాక.. నాలెడ్జ్ కూడా పెరుగుతుంది. మరి ఈ సెలవుల్లో మీరు కూడా అలాంటి ప్లేస్‌కి వెళ్లాలని భావిస్తున్నారా.. అయితే మీకు బెస్ట్ ఆప్షన్.. నగరంలోని సాలర్‌జంగ్ మ్యూజియం. పైగా ఇప్పుడు ఫ్రీ ఎంట్రీ ప్రకటిం చారు కూడా.

సాలర్‌జంగ్ మ్యూజియం వెళ్లాలనుకునేవారికి ఇదే కరెక్ట్ సమయం. మ్యూజియం నిర్వాహకులు ఇప్పుడు ఫ్రీ ఎంట్రీ ఆఫర్ ప్రకటించారు. ఇది ఈ నెల 16వ తేదీ నుంచి 21 వరకు వారం రోజుల పాటు అమల్లో ఉండనుంది. ఈ వార రోజుల్లో ఎలాంటి ప్రవేశం రుసుము లేకుండా సాలార్‌జంగ్ మ్యూజియంలోకి ఉచితంగా ప్రవేశం కల్పించినట్లు మ్యూజియం డైరెక్టర్ నాగేందర్‌రెడ్డి తెలిపారు. అయితే ఈ ఆఫర్ ఎందుకు ప్రకటించారంటే..

ఈ నెల 18న దేశవ్యాప్తంగా అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సాలార్‌జంగ్ మ్యూజియంలోనే వేడుకలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 16-21వ తేదీ వరకు విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సందర్శకులకు ఉచితంగా ప్రవేశం కల్పించినట్లు ఆయన వెల్లడించారు. దీనిలో భాగంగా ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మ్యూజియం తెరిచే ఉంటుందని.. ఫ్రీ ఎంట్రీ ఆఫర్ ఉంది కనుక.. కుటుంబ సమేతంగా తరలివచ్చి ఇక్కడ నిర్వహించే కార్యక్రమాలను వీక్షించాలని కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆఫర్స్..

## సిమెంట్, స్టీలు ధరలు భారీగా తగ్గింపు..?

తెలంగాణ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు ఊరటనిచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఉక్కు ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం నిర్మాణ సంస్థలతో చర్చలు జరుపుతోంది. మార్కెట్ ధరల కంటే తక్కువకు సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు కోరింది. త్వరలోనే దీనిపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ ఇందిరమ్మ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద ప్రభుత్వం ఇల్లు కట్టుకునే వారికి నాలుగు దశల్లో రూ. 5 లక్షలను వారి ఖాతాల్లో జమ చేస్తుంది. ఇప్పటికే ప్రతి జిల్లాలోనూ మండలాల వారీగా అర్హులను ఎంపిక చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది పనులు కూడా చేపట్టలేని



వారికి ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఇంటి నిర్మాణానికి అధికంగా అవసరమయ్యే సిమెంట్, ఉక్కు ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

తక్కువ ధరలకు సిమెంట్, ఉక్కు సరఫరా చేయాలని కోరుతూ నిర్మాణ సంస్థలతో ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. మార్కెట్ ధరల కంటే ఎంత తక్కువకు సరఫరా చేయగలరో తెలియజేస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. పరిశ్రమల ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, పరిశ్రమల ఇన్చార్జి కమిషనర్ మల్సూర్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతం ఇటీవల సిమెంట్, ఉక్కు సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి దాదాపు 15 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో సిమెంట్ బస్తా ధర రూ. 320 ఉండగా, పథకం కోసం రూ. 260కి సరఫరా చేయాలని అధికారులు కోరారు. అలాగే.. మార్కెట్లో ఉక్కు టన్ను ధర రూ. 50,000 నుండి రూ. 55,000 మధ్య ఉండగా.. పథకానికి రూ. 47,000కు సరఫరా చేయాలని కోరారు. ఒక్కో ఇంటికి 180 సిమెంట్ బస్తాల చొప్పున ఈ ఏడాది 4 లక్షల 50 వేల ఇళ్లకు 9 మిలియన్ టన్నుల సిమెంట్, ఒక్కో ఇంటికి 1500 కిలోల ఉక్కు చొప్పున 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఉక్కు అవసరమని అధికారులు కంపెనీల ప్రతినిధులకు వివరించారు.

ఈ పథకానికి అవసరమైన సిమెంట్, ఉక్కు పూర్తి వివరాలను ప్రభుత్వ ఉన్నతాధికారులు సిమెంట్, ఉక్కు సంస్థల ప్రతినిధులకు అందజేశారు. సోమవారం నాటికి తమ ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులు కోరారు. సంస్థల నుండి ప్రతిపాదనలు అందిన తర్వాత, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, గతంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డికి అందజేస్తామని అధికారులు తెలిపారు.

ఇదిలా ఉండగా.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన తెగల్లో అత్యంత వెనుకబడిన చెంచు వర్గానికి ఈ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రాధాన్యం కల్పించనున్నట్లు ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. చెంచుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ నియోజకవర్గాల్లో ఏకంగా 10 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.



# డ్వాక్రా మహిళలకు మరో శుభవార్త..

తెలంగాణ: తెలంగాణలో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, ఉచిత వైద్య పరీక్షలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులు వంటి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు ప్రోత్సాహం అందిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో 119 ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులను (ఎఫ్ఎఫ్సీ) త్వరలో పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల (ఎస్హెచ్‌జీ) మహిళలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య, క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక కార్డులు అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్డులలో ప్రతి సంవత్సరం మహిళలకు నిర్వహించే ఉచిత వైద్య పరీక్షల ఫలితాలు, వారి ఆరోగ్య సమాచారం, రుణ, వ్యాపార వివరాలను నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీహబ్ ఆధ్వర్యంలో జరిగిన 'ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్', విద్యార్థినుల కోసం 'యువ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్' లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీహబ్, 17 ఇతర సంస్థలు, విద్యాలయాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. మహిళా సంఘాలకు అదనంగా 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

హైటెక్ సిటీ సమీపంలో మహిళా సంఘాల కోసం మూడున్నర ఎకరాల స్థలంలో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని నిర్మిస్తున్నామని, మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన అందాల భామలు ఈ నెల 21న అక్కడికి వచ్చి మహిళా సంఘాల స్టాళ్లను సందర్శిస్తారని ఆయన వెల్లడించారు. దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దేశంలో మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారని, 1967 ఇండియా-చైనా యుద్ధం, 1971 ఇండియా-పాక్ యుద్ధంలో మహిళా శక్తి దేశానికి విజయాన్ని అందించింది అని ముఖ్యమంత్రి కొనియాడారు. మహిళా సంఘాలకు 1000 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి బాధ్యత అప్పగించా మని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లోని మహిళలను స్వయం సహాయక బృందాల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, వారు వ్యాపారాలు చేసుకునేలా సహకారం అందిస్తా మని, మహిళా సంఘాల నుంచి వెయ్యి బస్సులు ఆర్టీసీ కోసం తీసుకుంటామని చెప్పి ఇప్పటికే 150 తీసుకున్నామని, మరో 500 ఆర్టీసీకి ఇచ్చేలా ప్రోత్సహిస్తామని, విదేశీ ప్రతినిధులకు మహిళా సంఘాల ఉత్పత్తులనే బహుమతులుగా అందిస్తు న్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం కింద 140 చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తామని ఐటీ పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. వికారాబాద్, వరంగల్, హనుమకొండ, నల్గొండలలో వీహబ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఔటర్ రింగ్ రోడ్డు నుండి రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో ఏర్పాటు చేసే ఐదు ఎంఎస్ఎంఈ పార్కుల్లో మహిళలకు పది శాతం ప్లాట్లు కేటాయిస్తామని, వారి కోసం ప్రత్యేక పార్కును ఏర్పాటు చేయనున్నామని ఆయన వివరించారు.

# ప్లాస్టిక్ వ్యర్థాలతో అద్భుత ఆదాయం..



సూర్యాపేట: పురపాలక సంస్థ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైకిల్ చేస్తోంది. జమ్మానగర్‌లోని ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లో ప్లాస్టిక్‌ను శుద్ధి చేసి, ప్లాస్టిక్ ముద్దలుగా మారుస్తారు. ఈ ముద్దలను ఉపయోగించి ఇటుకలు, టైల్స్, ఆక్యుప్రెషర్ మ్యాట్‌లు వంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. 2022 నుండి ఇప్పటివరకు 30 టన్నుల ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయడం ద్వారా పురపాలక సంస్థ రూ. 5.50 లక్షలకు పైగా ఆదాయం పొందింది.

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలను సద్విని యోగం చేస్తూ సూర్యాపేట మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఒక ఆదర్శవంతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పట్టణంలో వృథాగా పడేసిన ప్లాస్టిక్‌ను సేకరించి, దానిని రీసైకిల్ చేస్తు న్నారు. జమ్మానగర్‌లోని ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లో.. సేకరించిన ప్లాస్టిక్‌ను మొదట డస్ట్ క్లీనర్ మిషన్ ద్వారా శుద్ధి చేస్తారు. ఆ తరువాత.. దానిని రీసైకిల్ చేసి ప్లాస్టిక్ ముద్దలుగా మారుస్తారు. ఈ ముద్దలను ఉపయోగించి ఇటుకలు, టైల్స్, ఆక్యుప్రెషర్ మ్యాట్‌లు వంటి వివిధ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.

సూర్యాపేట మునిసిపల్ అధికారులు 2022 నుండి ఇప్పటివరకు 30 టన్నుల ప్లాస్టిక్‌ను విజయవంతంగా రీసైకిల్ చేశారు. ఇటుకలు, టైల్స్, ఆక్యుప్రెషర్ మ్యాట్‌లు , ప్లాస్టిక్ ముద్దల అమ్మకం ద్వారా మునిసిపల్ కార్పొరేషన్ రూ. 5.50 లక్షలకు పైగా ఆదాయం పొందింది. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను భూమిలో పారవేయడం వల్ల భూమి కలుషితమవుతుంది. అలాగే.. దీనిని కాల్చడం వల్ల వెలువడే విషపూరిత వాయువులు ఆరోగ్యానికి హానికరం. సూర్యాపేట మునిసిపల్ కార్పొరేషన్ ఈ కార్యక్రమం ఇతర మునిసిపాలిటీలకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి.. మానవ ఆరోగ్యానికి అనేక రకాల నష్టాలు కలుగుతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోవడానికి వందల సంవత్సరాలు పడుతుంది. దీని వల్ల భూమి కలుషితం అవుతుంది.. భూసారం తగ్గిపోతుంది. ప్లాస్టిక్ సముద్రాల్లో చేరడం వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుంది.. జల చరాలు మరణిస్తాయి. ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల వెలువడే విష పూరిత వాయువులు శ్వాసకోశ సమస్యలకు .. ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. వీటిపై అవగాహన కల్పిస్తున్నా.. కొంత మంది ప్రజలు మారడం లేదు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రభుత్వాలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

**ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండిలా..**

ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులు లేదా జనపనార సంచులు వాడాలి. నీటి కోసం ప్లాస్టిక్ సీసాల బదులు స్టీల్ లేదా గాజు సీసాలు ఉపయోగించాలి. ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు మరియు స్పూన్ లను వాడకుండా.. వాటి స్థానంలో పర్యావరణ అనుకూలమైన ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ప్రభుత్వం కఠినమైన నియమాలు రూపొందించాలి.

# ప్రమాద బాధితులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా



హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలోని మీర్ చౌక్ ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనలో 17 మంది మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్‌లోని పాతబస్తీ, మీర్ చౌక్ ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య పెరగడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద స్థలంలో ముగ్గురు మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో 14 మంది కన్నుమూశారు. ఈ ఘోర దుర్ఘటనలో మొత్తం మరణాల సంఖ్య 17కు చేరింది. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో సుమారు 30 మంది ఉండగా, 17 మంది మరణించారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పోస్ట్‌మార్ట్ చేసిన తర్వాత కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు.

ఈ ప్రమాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుండి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల పరిహారం ప్రకటించారు. అలాగే, గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలు ఈ దుఃఖం నుండి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం బాధితులకు తక్షణ సహాయం అందిస్తుందని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ట్విట్టర్ ద్వారా తెలిపింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 17 మంది మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. అధికారులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

చార్మినార్ సమీపం ఉదయం 06:16 గంటల ప్రాంతంలో గుల్జార్ హౌస్ చౌరస్తాలో ఉన్న భవనంలో మంటలు అకస్మాత్తుగా చెలరేగాయి. మొఘల్‌పురా అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ఆ భవనం %+%o2 అంతస్తుల సముదాయం. మంటలు మొదట గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రారంభమై, క్షణాల్లోనే పై అంతస్తులకు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్లను అత్యంత వేగంగా ప్రారంభించారు. మొదటి అంతస్తులో చిక్కుకున్న 17 మందిని సిబ్బంది సాహసోపేతంగా రక్షించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. కానీ దురదృష్టవశాత్తు.. ఈ ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో పహ్లాద్, మున్నీ, రాజేంద్ర మోడీ, సుమిత్ర, హామీ, అభిషేక్, శీతల్, ప్రియాన్ష్, ఇరాజ్, అరుషి, రిషబ్, ప్రథమ్, అనుయన్, వర్ష, పంకజ్, రజని , ఇద్దు ఉన్నారు.

సమాచారం అందుకున్న వెంటనే.. అగ్నిమాపక కేంద్రాల నుండి 12 అగ్నిమాపక పరికరాలతో సహాయక చర్యలు చేపట్టారు. మొత్తం 11 వాహనాలు, ఒక అగ్నిమాపక రోబోట్, 17 మంది అగ్నిమాపక అధికారులు మరియు 70 మంది సిబ్బంది మంటలను ఆర్పడానికి.. చిక్కుకున్న వారిని రక్షించడానికి అవిశ్రాంతంగా పనిచేశారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకురావడానికి దాదాపు రెండు గంటల సమయం పట్టింది. అధికారులు.. సిబ్బంది చిక్కుకున్న వారిని రక్షించడానికి, మంటలను ఆర్పడానికి.. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా నిరోధించడానికి తీవ్రంగా శ్రమించారు. ఈ సహాయక చర్యలలో ఆధునిక సాంకేతిక పరికరాలైన అడ్వాన్స్‌డ్ ఫైర్ రోబోట్ .. బ్రోటో స్కైలిఫ్ట్ హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్‌ను కూడా ఉపయోగించారు.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు.. అనుకున్నది సాధించిన పవన్ కళ్యాణ్..

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల బెడద ఎక్కువైపోయింది! పంట పొలాలను కాపాడేందుకు ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. కర్ణాటక నుండి ప్రత్యేక శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు రాబోతున్నాయి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో కుదిరిన ఈ ఒప్పందం వెనుక అసలు కథేంటి? ఈ ఏనుగులు ఏ జిల్లాల్లో సంచారం చేయనున్నాయి? వాటి రాకతో ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలి!

ఆంధ్రప్రదేశ్‌కు కుంకీ ఏనుగులు ఎంట్రీ ఇవ్వబోతున్నాయి.. రాష్ట్రంలో పంట పొలాలను నాశనం చేస్తున్న ఏనుగుల బెడద నుంచి రక్షించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఏనుగుల్ని అదుపు చేయడానికి కర్ణాటక ప్రభుత్వం సహకారంతో ఆరు కుంకీ ఏనుగులు ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయి. ఈ మేరకు కర్ణాటక అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే క్లారిటీ ఇచ్చారు. ఈ నెల 21న బెంగళూరులోని విధానసౌధలో ఏనుగులను అప్పగించే కార్యక్రమం జరుగుతుందన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

కర్ణాటక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాలతో స్నేహంగా ఉంటోంది అని మంత్రి ఈశ్వర్ ఖండ్రే అన్నారు. గతేడాది ఆగస్టు 8న పవన్ కళ్యాణ్ కుంకీ ఏనుగులు కావాలని కోరారని గుర్తు చేశారు. సెప్టెంబర్ 27న విజయవాడలో జరిగిన చర్చల్లో ఏనుగులను ఇచ్చేందుకు అంగీకరించారని.. ఇప్పుడు వాటిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొనే ఏనుగులను మాత్రం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం లేదన్నారు. ఏపీ నుంచి ఏనుగులు కర్ణాటకలోకి రాకుండా అక్కడి ప్రభుత్వమే చర్యలు తీసుకుంటోంది అన్నారు.



ఆంధ్రప్రదేశ్ (ఏపీ), కర్ణాటక ప్రభుత్వాలు కుంకీ ఏనుగుల విషయంలో ఒక ఒప్పందం చేసుకున్నాయి. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే సమక్షంలో ఇరు రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కర్ణాటక నుంచి 8 ఏనుగులను ఏపీకి పంపడానికి ఈ ఒప్పందం కుదిరింది. చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏనుగుల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి ఈ చర్య తీసుకున్నారు. ఈ సమస్యపై పవన్ కళ్యాణ్ ఇటీవల బెంగళూరు వెళ్లి కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో చర్చించారు. కుంకీ ఏనుగులను పంపమని ఆయన కోరగా, వారు వెంటనే అంగీకరించారు. ఈ మేరకు ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగింది.

చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏనుగుల సంచారం వల్ల వస్తున్న సమస్యలను పరిష్కరించడానికి కుంకీ ఏనుగులను తెస్తున్నామన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో మాట్లాడిన వెంటనే ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ప్రస్తుతం అటవీ శాఖ దగ్గర ఉన్న ఏనుగులు వయసు పైబడటంతో ఇబ్బందులు వస్తున్నాయని.. అందుకే అదనంగా కొన్ని కుంకీ ఏనుగులను పంపమని కర్ణాటకను కోరామన్నారు. వీటి ద్వారా ఏపీలోని చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో ఏనుగుల దాడుల సమస్యను అరికట్టవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## విమానాల తరహాలో బస్సుల్లో కూడా

**ఆంధ్రప్రదేశ్:** ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తోంది. ప్రమాదాలను నివారించేందుకు కొత్త బస్సుల్లో ఫైర్ అలారం సిస్టమ్, అగ్నిమాపక సిలిండర్లను ఏర్పాటు చేస్తోంది. అంతేకాకుండా, బస్సుల ఆచూకీ తెలుసుకునేందుకు లైవ్ ట్రాకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికులు యాప్ ద్వారా బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు. పాత ట్రాకింగ్ విధానానికి స్వస్తి పలికి, టికెట్ మిషన్ ద్వారా బస్సుల సమాచారం తెలుసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బస్సుల్లో అగ్ని ప్రమాదాల నిరోధించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని కొత్త బస్సుల్లో ప్రయాణికుల భద్రత కోసం సెన్సార్‌తో నడిచే ఫైర్ అలారాన్ని అమర్చుతున్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగితే అదుపు చేసేందుకు బస్సుల్లో సిలిండర్లు ఉంచుతున్నారు. విజయవాడ విద్యాధరపురం డిపోలోని కొత్త బస్సుల్లో ప్రస్తుతం ఈ పరికరాలను అమర్చారు. ఇకపై అన్ని ఏపీఎస్‌ఆర్టీసీ కొత్త బస్సుల్లోనూ వీటిని ఏర్పాటు చేయనున్నారు. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేశారు ఆర్టీసీ అధికారులు.

ఒకవేళ బస్సుల్లో చిన్న పాటి పొగ లేదా స్పార్క్ రాగానే ప్రయాణికులను హెచ్చరించే వ్యవస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది ఆర్టీసీ. ఈ మేరకు ప్రయాణికుల భద్రత దృష్ట్యా సెన్సార్లతో పనిచేసేలా ఏర్పాట్లు చేశారు. ముందుగా ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఈ విధానాన్ని తీసుకొచ్చారు. విమానాల్లో ఏర్పాటు చేస్తోన్న తరహాలో సెన్సార్లతో పనిచేసే ఫైర్ అలారం వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రయాణికుల ప్రాణాలకు ప్రభుత్వం భద్రత కల్పిస్తోంది.

మరోవైపు ఏపీఎస్‌ఆర్టీసీ ప్రయాణికుల కోసం కొత్త సేవలను అందుబాటులోకి తెస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, బస్సులను ట్రాక్ చేసే వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా బస్సు ఎక్కడ ఉంది, ఏ రూట్‌లో వెళ్తుంది వంటి వివరాలను తెలుసుకోవచ్చు. గతంలో ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సులకు మాత్రమే ఈ సదుపాయం ఉండేది. ఇప్పుడు పల్లె వెలుగు సహా బస్సులకు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్ ట్రాకింగ్ యాప్ ద్వారా ప్రయాణికులు తమ బస్సుల వివరాలను తెలుసుకోవచ్చు. బస్సు డిపో నుండి బయలుదేరిన దగ్గర నుండి గమ్యస్థానానికి చేరే వరకు సమాచారం తెలుసుకోవచ్చు.. ఈ మేరకు ఈ ట్రాకింగ్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది.

గతంలో ఉన్న పాత విధానాన్ని తొలగించి కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. పాత డివైజ్డ్ సిస్టమ్ స్థానంలో టికెట్ ఇష్యూయింగ్ మిషన్ సిస్టమ్‌ను తీసుకొచ్చారు. టిమ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిమ్ నెట్‌వర్క్ ద్వారా బస్సు ఎక్కడ ఉందో ట్రాక్ చేయవచ్చు. లైవ్ ట్రాకింగ్ కోసం ఆర్టీసీ ఆన్‌లైన్ బస్ ట్రాకింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో 'సెర్చ్ ఫర్ బసెస్ బిట్వీన్ టు లొకేషన్స్(ఫ్రం-టు)'లో బస్సులకు సంబంధించిన వివరాలు నమోదు చేయాలి. అందులో ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నారో ఆ వివరాలు ఇవ్వాలి. బస్సుకు సంబంధించిన సర్వీసు నంబరు కొడితే బస్సు ఎక్కడ ఉందో తెలుస్తుంది. దీంతోపాటు లైవ్ లొకేషన్ కూడా అందుబాటులోకి వచ్చింది. నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో లైవ్ లొకేషన్ రాదు.. ఇంకా కొన్ని రూట్లలో జియో మ్యాపింగ్ చేయాల్సి ఉంది. త్వరలో ఇది కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామంటున్నారు.

## శ్రీశైలం దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సస్పెన్షన్..

**శ్రీశైలం:** శ్రీశైలంలో అన్యమతస్తుల ప్రవేశంతో ఆలయ భద్రతాధికారి సస్పెండ్ అయ్యారు. మరోవైపు, ఆదోనిలో లక్ష్మమ్మవ్వ 93వ వెండి రథోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. కర్ణాటక, మహారాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మమ్మవ్వ కో-ఆపరేటివ్ బ్యాంకు ద్వారా ప్రజలకు ఆర్థిక సహాయం అందుతోంది. ఉచిత నీరు, కుట్టు శిక్షణ వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. రథోత్సవానికి బంగారు కిరీటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రముఖ శైవక్షేత్రమైన నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్న దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్నపై సస్పెన్షన్ వేటు పడింది. శ్రీశైలానికి 10 రోజుల క్రితం కొందరు అన్యమతస్తులు వచ్చినట్లు తేలింది.. వారి దగ్గర అన్యమత పుస్తకాలు కూడా ఉన్నాయి. వీరిని గమనించి శ్రీశైలం ఆలయం భద్రతా సిబ్బంది వారిని హెచ్చరించి వెనక్కి పంపించారు సీఎస్‌వోగా ఉన్న అయ్యన్న ఉద్యోగ బాధ్యతలపై నిర్లక్ష్యంగా ఉన్నారంటూ.. శ్రీశైలం మల్లన్న ఆలయ ఈవో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.. శ్రీశైలంకు అన్యమతస్తులు వచ్చిన ఈ ఘటన ఆలస్యంగా బయటపడింది.

శ్రీశైలం దేవస్థానం క్షేత్ర పరిధిలో టోల్ గేట్ దాటుకుని కొందరు అన్యమతస్తుల సంచరించారనే వీడియోలు స్థానికంగా కలకలం రేపింది. ఈ వీడియోలు ఆధారంగా అన్యమతస్తులు శ్రీశైలంలోకి ఎలా వచ్చారు టోల్ గేట్ దగ్గర సెక్యూరిటీ సిబ్బందిని దాటుకుని క్షేత్రం పరిధిలోకి వచ్చేటప్పుడు ఎవరు వస్తున్నారు.. ఏంటి అనే విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఈవో శ్రీనివాసరావు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్నను వివరణ కోరారు. ఈ క్రమంలో ఈవో శ్రీనివాసరావు విచారణ జరిపి అయ్యన్నను సస్పెండ్ చేశారు.



ఆదోనిలో శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ 93వ వెండి రథోత్సవం ఘనంగా జరుగుతోంది. ఈ ఉత్సవానికి కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఉత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. రథోత్సవం సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆదోని ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్నారు. ప్రతి సంవత్సరం ఇక్కడ వెండి రథోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని చూడడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు వస్తారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు.

మహాయోగి లక్ష్మమ్మవ్వ మూలవిరాట్టుకు, బృందావనానికి, శిలాపాదుకలకు అభిషేకం, పుష్ప అలంకారాధి పూజలు నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి వెండి రథోత్సవం ప్రారంభమవుతుంది. ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 1998 నుంచి వెండి రథాన్ని ఊరేగిస్తున్నారు. లక్ష్మమ్మవ్వ పేరుతో కో-ఆపరేటివ్ బ్యాంకును ఏర్పాటు చేశారు. ఈ బ్యాంకు ద్వారా చిన్న వ్యాపారులకు, ఉద్యోగులకు రుణాలు అందిస్తున్నారు. దీని ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. బ్యాంకు దగ్గరలో ఆధ్యాత్మిక కేంద్రం కూడా ఉంది. ఇక్కడ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. పాఠశాల, కళాశాల స్థాయిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు స్వర్ణ పతకాలు అందజేసి సత్కరిస్తారు.

దేవాలయం దగ్గర శుద్ధ జల యంత్రాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రజలకు ఉచితంగా మంచి నీటిని అందిస్తున్నారు. కుట్టు శిక్షణ కేంద్రం ద్వారా మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. దీని ద్వారా మహిళలు ఉపాధి పొందేందుకు సహాయం చేస్తున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాచోటి రామయ్య ఆధ్వర్యంలో 1.3 కిలోల బంగారు కిరీటాన్ని తయారు చేయించారు. అమ్మవారికి ఈ కిరీటాన్ని అలంకరిస్తారు. రథోత్సవం సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శ్రీవారికి మైసూరు మహారాజు కుటుంబం భారీ విరాళం..

**మైసూర్ మహారాజు యదువీర్ వడియార్, రాజమాత ప్రమోదాదేవి టీటీడీ ఛైర్మన్‌ను తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని మర్యాదపూర్కంగా కలిశారు. క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో చైర్మన్ రాజమాతకు శ్రీవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందించారు. రాజమాత శ్రీవారికి వెండి దీప స్తంభాలను విరాళంగా సమర్పించనున్నారు.**



**తిరుమల:** శ్రీవారికి మైసూరు రాజమాత ప్రమోదాదేవి భారీ విరాళం అందజేశారు. రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు రెండు భారీ వెండి అఖండ దీపాలను సమర్పించారు. ఒక్కో అఖండం 50 కిలోల బరువు ఉంటుంది. 300 ఏళ్ల తర్వాత మళ్లీ మైసూరు రాజ వంశం ఈ తరహా కానుకలు ఇవ్వడం విశేషం. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు. ఇంతకీ ఆ అఖండ దీపాలు ఎందుకు ప్రత్యేకమో తెలుసా?

తిరుమల శ్రీవారికి మైసూరు రాజమాత ప్రమోదాదేవి భారీ విరాళం అందించింది. ఈ మేరకు స్వామివారి ఆలయానికి రెండు భారీ వెండి అఖండాలు (అఖండ దీపాలు)ను విరాళంగా అందజేశారు. ఈ మేరకు రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ అధికారులకు వాటిని అందించారు. ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోల బరువు ఉంటుంది. ఈ అఖండాలు శ్రీవారి గర్భగుడిలో వెలిగించే సంప్రదాయ దీపాలు. సుమారు 300 ఏళ్ల క్రితం అప్పటి మైసూరు మహారాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు చరిత్రలో ఉంది. శతాబ్దాల తర్వాత ఇప్పుడు మళ్లీ మైసూరు రాజమాత వాటిని సమర్పించడం విశేషం. టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతకముందు మైసూర్ మహారాజు యదువీర్ వడియార్, రాజమాత ప్రమోదాదేవి టీటీడీ ఛైర్మన్‌ను తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని మర్యాదపూర్కంగా కలిశారు. క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో చైర్మన్ రాజమాతకు శ్రీవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందించారు. రాజమాత శ్రీవారికి వెండి దీప స్తంభాలను విరాళంగా సమర్పించనున్నారు. మైసూర్ సంస్థానం తరపున ఈ పవిత్ర సేవ కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా బోర్డు సభ్యుడు నరేష్ కూడా చైర్మన్‌తో కలిసి ఉన్నారు.

మరోవైపు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిసాను. శ్రీ పద్మావతి అతిథి గృహంలో శ్రీవారి శేషవస్త్రం సమర్పించి, తీర్థప్రసాదాలు అందజేశా. ఈ సందర్భంగా బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, నరేష్ కూడా వారితో పాటూ ఉన్నారు. శ్రీవారి అనుగ్రహం అందరికీ అందాలని కోరుకుంటున్నాను అన్నారు టీటీడీ ఛైర్మన్.

ఇంటర్నేషనల్ డే ఆఫ్ బయోలాజికల్ డైవర్సిటీ 2025 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు గుంటూరు ఆధ్వర్యంలో శ్రీ పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాల నందు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన పోటీలకు తిరుపతి జిల్లాలోని పలు జడ్పీ హైస్కూల్, ఎస్పీ డబ్ల్యూ డి ఫార్మశీ విద్యార్థినీలు పాల్గొన్నారు. డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీలలో కె. తేజస్విని ప్రథమ స్థానం పొందగా, పి. మాయ ద్వితీయ స్థానం, బి. మహేశ్వరికి, జడ్పీ హైస్కూల్ పుదుపేట కు చెందిన జే.డి. గుణసుందరి మూడో ప్రైజ్ పొందారు. డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో ఎస్పీడబ్ల్యూ విద్యార్థిని కె. తేజస్విని ఎంపికైంది. వ్యాసరచన పోటీలలో మొదటి ప్రైజ్ జడ్పీ హైస్కూల్ పుదుపేటకు చెందిన ఎస్ జీ లతిక, రెండోవ స్థానం జడ్పీ హైస్కూల్ కరకంబాటికి చెందిన పి. లహరి, మూడో ప్రైజ్ ఎస్పీడబ్ల్యూ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన జె. తేజస్విని, బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన కె. వర్షిత పొందారు. గెలుపొందిన విద్యార్థినీలకు టిటిడి బోర్డు ఛైర్మెన్ బీఆర్ నాయుడు, ఈవో జె శ్యామలరావు, డిఈవో వెంకట సునీల్, ప్రిన్సిపాల్ డా. ఎం. పద్మావతమ్మ, రాష్ట్ర సమన్వయ కర్త పి. నీలకంఠయ్య అభినందనలు తెలిపారు.

## ప్రతి నెలా రూ.3వేలు పింఛన్ వస్తుంది...

**ఆంధ్రప్రదేశ్:** రైతులారా, మీకోసం కేంద్ర ప్రభుత్వం ఒక అద్భుతమైన పథకాన్ని అందిస్తోంది! వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకం ద్వారా 60 ఏళ్లు దాటిన రైతులకు ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్‌గా అందుతుంది. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం పొందడానికి వెంటనే దరఖాస్తు చేసుకోండి. మరిన్ని వివరాల కోసం వెంటనే కామన్ సర్వీస్ సెంటర్‌ను సందర్శించండి.

ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం గురించి తెలుసా.. కేంద్రం చిన్న, సన్నకారు రైతుల కోసం ఈ పథకాన్ని అందిస్తోంది. ఈ ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం కింద 60 ఏళ్లు దాటిన రైతులకు ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్‌గా అందిస్తారు. వృద్ధాప్యంలో రైతులకు ఆర్థికంగా సహాయం చేయాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకానికి 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న రైతులు అర్హులు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు, కిసాన్ లబ్ధిదారులు ఈ పథకంలో పేరు నమోదు చేసుకోవచ్చు. పన్ను చెల్లించేవారు, ఇతర సామాజిక భద్రత పథకాలలో ఉన్నవారు ఈ పథకానికి అర్హులు కాదు.

ఈ పథకంలో చేరడానికి రైతులు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న రైతులు నెలకు రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాలి. 18 ఏళ్ల వయసున్న రైతు నెలకు రూ.55 చెల్లిస్తే.. కేంద్రం అంతే మొత్తం రూ.55 కలిపి మొత్తం రూ.110 జమ చేస్తారు. వయసు పెరిగే కొద్దీ ప్రీమియం కూడా పెరుగుతుంది. 21 ఏళ్ల వయసున్న



రైతులు రూ.61, 25 ఏళ్ల వారు రూ.80, 30 ఏళ్ల వారు రూ.106, 35 ఏళ్ల వారు రూ.150, 40 ఏళ్ల వారు రూ.200 ప్రీమియం చెల్లించాలి. 60 ఏళ్లు నిండిన తర్వాత ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్ వస్తుంది. ఒకవేళ రైతు మరణిస్తే.. వారి నామినీకి జీవితాంతం నెలకు రూ.1500 పింఛన్ వస్తుంది.

ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి రైతులు కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లాలి. అక్కడ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, నామినీ వివరాలు అందజేయాలి. దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని.. రైతు సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. పింఛన్ కార్డు వస్తుంది.. కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు చెల్లించాలి. ఈ పథకం గురించి రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. అర్హత ఉన్నవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. కేంద్రం అందించే పథకాల గురించి రైతులకు సమాచారం ఉండకపోవడంతో దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు వారికి అవగాహన కల్పించి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచనల్ని చేస్తున్నారు.



## వైసీపీకి మరోసారి దెబ్బ మీద దెబ్బ..

**ఆంధ్రప్రదేశ్:** వైఎస్సార్‌సీపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. కదిరి మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది, దిల్షా దున్నీషా ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్‌గా టీడీపీకి చెందిన శరత్‌బాబు గెలుపొందారు. తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక కోరం లేక వాయిదా పడింది. సత్యసాయిజిల్లా రామగిరి ఎంపీపీ ఎన్నిక కూడా వాయిదా పడింది, విశాఖపట్నం డిప్యూటీ మేయర్ ఎన్నిక సైతం వాయిదా పడింది.

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీకి వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి.. పార్టీ నుంచి నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుంటే.. ఇటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా షాక్ తప్పడం లేదు. ఇవాళ మరోసారి స్థానిక సంస్థలకు సంబంధించిన పదవుల కోసం ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు.. వైఎస్సార్‌సీపీకి మరికొన్ని పదవులు చేజారాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోని కదిరి మున్సిపాలిటీ టీడీపీ ఖాతాలోకి చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా దిల్షా దున్నీషా..వైస్ చైర్మన్లుగా సుధారాణి, రాజశేఖర్ ఆచారి సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ గెలుపుతో మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.. అయితే ఈ ఎన్నికను వైఎస్సార్‌సీపీ బహిష్కరించింది. కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 ఉంటే.. 25 మంది, వైసీపీకి 11 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అంతకముందు బెంగళూరు క్యాంప్‌లో ఉన్న టీడీపీ కౌన్సిలర్లు.. మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక.. అనంతరం వైస్ చైర్మన్ల ఎంపిక ఏకగ్రీవమైంది.


మరోవైపు విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్‌గా టీడీపీకి చెందిన శరత్‌బాబు ఎన్నికయ్యారు. గత నెల 29న గత ఛైర్మన్ మురళీకృష్ణారావుపై అవిశ్వాసం ప్రవేశపెట్టారు. ఇవాళ అవిశ్వాస ఓటింగ్‌లో టీడీపీ గెలవడంతో మురళీకృష్ణారావు ఛైర్మన్ పదవి కోల్పోయారు. 20 మంది సభ్యుల మద్దతుతో బొబ్బిలి మున్సిపాలిటీ కూటమి ఖాతాలోకి చేరింది. ఇక తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక వాయిదాపడింది.. కోరం లేకపోవడంతో మంగళవారానికి ఎన్నిక వాయిదా వేశారు. మొత్తం 20 మందికి గాను ఏడుగురు మాత్రమే హాజరుకావడంతో వాయిదా వేస్తూ ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు. శ్రీసత్యసాయిజిల్లా రామగిరి ఎంపీపీ ఎన్నిక మూడోసారి వాయిదా పడింది. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి గైర్హాజరుకావడంతో ఎన్నిక వాయిదా పడింది. గతంలో కోరం లేక ఎంపీపీ ఎన్నిక రెండుసార్లు వాయిదా పడింది.

ఇటు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ ఎన్నిక కూడా వాయిదా పడింది. కోరం లేకపోవడంతో ఉన్నతాధికారులు ఈ ఎన్నిక మంగళవారానికి వాయిదా వేశారు. డిప్యూటీ మేయర్ ఎన్నికకు మొత్తం 56 మంది కార్పొరేటర్లు కావాల్సి ఉండగా.. సోమవారం 54 మంది మాత్రమే వచ్చారు. ఈ కారణంతోనే ఎన్నిక వాయిదాపడింది. డిప్యూటీ మేయర్ పదవి జనసేన పార్టీకి కేటాయించారు.

## విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.100 ఇస్తారు..

**ఆంధ్రప్రదేశ్:** ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఒక శుభవార్త చెప్పింది. ఈ విద్యా సంవత్సరం నుంచి కాస్మొటిక్ ఛార్జీలకు బదులుగా 12 రకాల వస్తువులతో కూడిన కిట్లను ఇవ్వనున్నారు. దీని ద్వారా దాదాపు 4,800 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. గతంలో 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం ఇలాంటి నిర్ణయమే తీసుకుంది. 2018 నవంబరులో గురుకుల విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీల బదులు 12 రకాల వస్తువుల కిట్లను ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో అది అమలు కాలేదు. ఆ తరువాత గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ విధానాన్ని కొనసాగించలేదు. కాస్మొటిక్ ఛార్జీలు ఇస్తామని చెప్పినా, ఆ తర్వాత దాని గురించి పట్టించుకోలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులే ప్రతి నెల తమ పిల్లలకు కావాల్సిన వస్తువులు కొనివ్వాల్సి వచ్చేది.

ఈ కొత్త నిర్ణయం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అంటున్నారు. ఇకపై రెండు నెలలకు ఒకసారి ఈ కిట్లను విద్యార్థులకు అందిస్తారు.



సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో చదివే అబ్బాయిలకు క్షవరం కోసం నెలకు రూ.50 చొప్పున, రెండు నెలలకు రూ.100 ఇవ్వాలని నిర్ణయించారు. దీనివల్ల ఉమ్మడి జిల్లాలోని బాలుర పాఠశాలల విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది.

ఈ కిట్‌లో.. కొబ్బరి నూనె, టూత్‌పేస్ట్, బ్రష్, టంగ్ క్లీనర్, ఫేస్ పౌడర్, షాంపూ, సబ్బు, బట్టలు ఉతికే సబ్బు, హెయిర్ బాండ్, రిబ్బన్లు, వాజ్‌లైన్, వాషింగ్ పౌడర్ వంటి వస్తువులు ఉంటాయి. అయితే ఐదు, ఆరు తరగతుల వారికి 11 రకాల వస్తువులే ఇస్తారు. ఏడు నుంచి 12వ తరగతి విద్యార్థులకు మాత్రం 12 రకాల వస్తువులు ఇస్తారు. ఈ నిర్ణయంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని.. వారి చదువుకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుంది అంటున్నారు. వారి తల్లిదండ్రులకు అదనపు భారం తగ్గుతుందని భావిస్తున్నారు.

# ప్రభాస్ నా మంచి కోరుతున్నాడు





మంచు విష్ణు నటించిన 'కన్నప్ప' మూవీలో ప్రభాస్ రుద్ర పాత్రలో కనిపించనున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా విష్ణు తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ తో తనకున్న అనుభందాన్ని గుర్తు చేసుకున్నారు. తామిద్దరం మంచి స్నేహితులమని అన్నారు. స్టార్‌డమ్ గురించి పట్టించుకోకుండా తన లోకంలో తానుంటాడని కొనియాడారు. రక్త సంబంధీకులే తన ఎదుగుదలను కోరుకోవడం లేదని, ప్రభాస్ మాత్రం తన సక్సెస్ కోరుకుంటున్నాడని విష్ణు కాస్త ఎమోషనల్ గా మాట్లాడారు. ఇంకా ఏం మాట్లాడారంటే..

మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ 'కన్నప్ప'. తన హోమ్ ప్రొడక్షన్ లో భారీ బడ్జెట్ తో ఈ హిస్టారికల్ ఫాంటసీ డ్రామాని తెరకెక్కించారు. ఇందులో రెబల్ స్టార్ ప్రభాస్ తో పాటుగా.. మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ లాంటి పాపులర్ స్టార్స్ నటిస్తున్నారు. ప్రమోషనల్ కంటెంట్ తోనే ఆడియన్స్ దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం.. జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ కోసం ఇటీవలే యూఎస్ వెళ్లిన విష్ణు.. అక్కడ ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో ప్రభాస్ పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసారు.

'కన్నప్ప' సినిమాలో రుద్ర అనే పాత్రలో ప్రభాస్ కనిపించనున్నారు. ఆల్రెడీ రిలీజైన ఫస్ట్ లుక్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఆయనది స్పెషల్ రోల్ అయినప్పటికీ, సినిమాపై హ్యూజ్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. నార్త్ లో భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. ఇక మంచు విష్ణు ఎక్కడికి వెళ్లినా ప్రభాస్ గురించి మాట్లాడుతున్నారు. డార్లింగ్ తో తనకున్న అనుబంధాన్ని చాటుకుంటున్నారు. సినిమాలో నటించినందుకుగాను ఒక్క రూపాయి కూడా రెమ్యునరేషన్ తీసుకోలేదని తెలిపారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని లేటెస్ట్ ఇంటర్వ్యూలో విష్ణు అన్నారు.

"ప్రభాస్ ని నేను ఏకవచనంతో తిడుతుంటాను. మేము చాలా క్లోజ్. అతను ఎంత పెద్ద స్టార్ అనేది అతడికి తెలియదు. అతని లోకంలో అతను ఉంటాడు.. ఎవరి గురించి పట్టించుకోడు. అతని లైఫ్ అతనిది. షూటింగ్ కి వచ్చాడా వెళ్లిపోయాడా.. అంతే. ప్రభాస్‌లా చాలా తక్కువమంది ఉంటారు. కెరీర్ బిగినింగ్ లో అందరూ అలానే ఉంటారు. కానీ ఆసియాలోనే బిగ్గెస్ట్ స్టార్స్ లో ఒకరిగా ఉంటూ కూడా అంత హంబుల్ గా ఉండటం అతని గొప్పతనం. 'నువ్వు ఏ రోజుకీ మారకూడదు ప్రభాస్.. నువ్వు ఇలాగే ఉండాలి' అని అంటే.. 'ఏముంది, మనం ఎప్పుడూ ఇంతే కదా' అన్నాడు. అతను ఎల్లప్పుడూ అలానే ఉంటాడు"

"15 ఏళ్ల క్రితం ఓసారి నేనూ ప్రభాస్ మాట్లాడుకుంటున్నప్పుడు, 'నువ్వు ఎందుకు ఎక్కువ కలవవు' అని అడిగాడు. నన్ను ఎక్కువ కలిస్తే నేను నీకు నచ్చను బ్రదర్ అన్నాను. 'మూడు నెలలకో ఆరు నెలలకో ఒకసారి కలుసుకుంటే, మనం ఎప్పటికీ గ్రేట్ ఫ్రెండ్స్ గా ఉంటాం. ఎందుకంటే మనిద్దరం వేర్వేరు బడుల నుంచి వచ్చాం. నేను లేచే టైం.. నీ పడుకునే టైం. రెండూ డిఫరెంట్. అయినా సరే మనం ఎప్పటికీ మంచి సోదరులమే' అని చెప్పాను. రక్తం పంచుకొని పుట్టినవాళ్లే ఈరోజు నా పతనాన్ని కోరుకునేటప్పుడు.. నేను, ప్రభాస్ రక్తం పంచుకొని పుట్టకపోయినా నా మంచి కోరి నా సక్సెస్ కోరుతున్నాడు. ఎన్ని జన్మలకైనా అతనికి నేను రుణపడి ఉంటాను. నిజంగా ప్రభాస్ కి నేను కృతజ్ఞుడిగా ఉంటాను" అని మంచు విష్ణు అన్నారు.

# 'అఖండ 3' కూడా ఉంటుందట



బాలయ్య ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇచ్చే అప్‌డేట్‌గా మారింది. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీ మొత్తంలో సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో 'హిట్' సిరీస్ తరహాలో 'అఖండ' సిరీస్ రూపొందించాలన్న బోయపాటి ప్లాన్‌పై ఆసక్తికర చర్చ సాగుతోంది. నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్లో వస్తోన్న తాజా చిత్రం 'అఖండ 2'. గతంలో వచ్చిన 'అఖండ' మూవీకి ఇది సీక్వెల్‌గా వస్తోంది. వీరిద్దరి కాంబినేషన్లో ఇప్పటివరకు వచ్చిన సింహ, లెజెండ్, అఖండ చిత్రాలు ఒకదానికి మించి మరొకటి సక్సెస్ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 'అఖండ 2'ని అంతకుమించి తీర్చిదిద్దేలా బోయపాటి శ్రీను తెగ కష్టపడుతున్నాడు. 'అఖండ 2'ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇందులో ఆధ్యాత్మిక అంశాలతో పాటు హై యాక్షన్ సీన్స్ ఉండేలా బోయపాటి గట్టిగానే ప్లాన్ వేస్తున్నాడు. అఖండ మూవీకి మించి మరో రేంజులో తమన్ మ్యూజిక్ రెడీ చేస్తున్నాడట. తాజాగా 'అఖండ 2'కి సంబంధించి ఓ అప్‌డేట్ హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాకి మూడో భాగం కూడా ఉందంట. 'అఖండ 2'లో ఎవరూ ఊహించని ట్విస్ట్ ఉంటుందట. అక్కడ ఎంట్రీ ఇచ్చే ఓ పాత్రతో ఫ్లాష్‌బ్యాక్‌తో 'అఖండ 3' తీసేందుకు బోయపాటి అప్పుడే కథ రెడీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇది నిజమో కాదో తెలియదు కానీ.. ఈ వార్త మాత్రం బాలయ్య ఫ్యాన్స్‌కి మంచి కిక్ ఇస్తోంది. ప్రస్తుతం అన్ని సినీ ఇండస్ట్రీల్లోనూ సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తున్న వేళ.. 'అఖండ'ని కూడా ఓ సిరీస్ మాదిరిగా క్రియేట్ చేయాలని బోయపాటి ప్లాన్ అట. తెలుగులో 'హిట్' సిరీస్ మాదిరిగానే 'అఖండ' సిరీస్‌లో మరిన్ని చిత్రాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు 'హిట్ 4'లో హీరో కార్తి నటించనుండగా.. 'హిట్ 5'లో బాలయ్య సూపర్ రోల్‌లో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు రజినీకాంత్ హీరోగా నటిస్తోన్న 'జైలర్ 2'లో బాలకృష్ణ ఏపీ పోలీస్‌గా కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. అలాగే తమిళంలో 'గుడ్ బ్యాడ్ అగ్లీ'తో హిట్టు అందుకున్న డైరెక్టర్ అధిక్ రవిచంద్రన్‌తోనూ బాలయ్య ఓ సినిమా చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# ఒక్క హిట్టుతో మారిన తలరాత..



2022లో అల్లూరి చిత్రంతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన కయాదు లోహర్‌కి తక్కువగానే అవకాశాలు వచ్చాయి. కానీ 2025లో తమిళంలో విడుదలైన డ్రాగన్ సినిమా ఆమె కెరీర్‌ను మలుపుతిప్పింది. గ్లామర్‌కి తోడు నటనకు స్కోప్ ఉన్న పాత్రలో మెప్పించిన కయాదు, ఇప్పుడు వరుస అవకాశాలతో బిజీగా ఉంది. నానితో ది ప్యారడైజ్, ధనుష్, శింబు చిత్రాల్లో కూడా అవకాశం దక్కనుందని టాక్. డ్రాగన్కు ముందు రూ.30 లక్షలు తీసుకున్న కయాదు, హిట్ తర్వాత రూ.2 కోట్లకు రెమ్యునరేషన్ పెంచిందట. ధనుష్‌తో నటిస్తే ?3 కోట్లు అందుకునే అవకాశం ఉంది. చిన్న సినిమా అయినా సరైన సక్సెస్ ఇస్తే హీరోయిన్ రేంజ్ ఎలా మారుతుందో కయాదు ఉదాహరణగా నిలిచింది.

ఇండస్ట్రీలోకి ఎప్పుడొచ్చామన్నది కాదు ఎంత త్వరగా హిట్టు కొట్టామన్నదే ముఖ్యం. అయితే 'డ్రాగన్' బ్యూటీ కయాదు లోహర్ విషయంలో మాత్రం హిట్టు కాస్త ఆలస్యమైంది. 2021లో కన్నడ చిత్రం మొగిల్‌పేటతో సినిమాల్లో అరంగ్రేటం చేసిన కయాదు... 2022లో శ్రీవిష్ణు హీరోగా తెరకెక్కిన 'అల్లూరి' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఆ సినిమాతో మంచి మార్కులు కొట్టేసినా ఆమెకు అవకాశాలు మాత్రం రాలేదు. ఆ తర్వాత ఇతర భాషల్లో కొన్ని సినిమాలు చేసినా క్రేజ్ మాత్రం రాలేదు. ఈ ఏడాది తమిళంలో ప్రదీప్ రంగనాథ్ సరసన నటించిన 'డ్రాగన్' మూవీ ఆమె జాతకాన్నే మార్చేసింది. గ్లామర్‌తో పాటు నటనకు ఆస్కారమున్న పాత్ర కావడంతో సత్తా చూపించింది. ఈ మూవీ తమిళంలో పాటు తెలుగులోనూ ఆమెకు వరుస అవకాశాలు వస్తున్నాయి. నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంలో హీరోయిన్‌గా కయాదు లోహర్ ఎంపికైనట్లు ప్రచారం జరుగుతోంది.

'డ్రాగన్' మూవీకి సంబంధించి ఈ బ్యూటీకి కేవలం రూ.30లక్షలే ఇచ్చారట. అయితే ఈ సినిమా బంపర్ హిట్టు కొట్టడంతో ఆ తర్వాత మరో రూ.70లక్షలు ఇచ్చి మొత్తం రూ.కోటి ముట్టజెప్పారట. దీంతో తన నెక్స్ట్ సినిమాలకి ఏకంగా రూ.2కోట్లు డిమాండ్ చేస్తోందట ఈ అమ్మడు. ప్రస్తుతం తమిళంలో అధర్వకు జంటగా నటిస్తోన్న కయాదు లోహర్.. ధనుష్, శింబు సినిమాల్లోనూ ఛాన్సులు అందుకున్నట్లు తెలుస్తోంది. శింబు 49న చిత్రంలో నటిస్తోన్న కయాదు.. 'పోర్ తొళిల్' ఫేమ్ విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో ధనుష్ హీరోగా నటించనున్న చిత్రంలోనూ ఆమెను తీసుకునేందుకు చర్చలు నడుస్తున్నాయట. ధనుష్‌తో జతకడితే ఆ అమ్మడి రెమ్యునరేషన్ రూ.3కోట్లు దాటే ఛాన్స్ ఉందని అంటున్నారు.

# అల్లు అర్జున్‌తో లవ్ స్టోరీ..



మెగా బ్రదర్ నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల మల్టీ టాలెంటెడ్ అనిపించుకుంది. హీరోయిన్ గా, హోస్టుగా చేసిన మెగా డాటర్.. నిర్మాతగానూ రాణిస్తోంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ అనే బ్యానర్ స్థాపించి ఓవైపు వెబ్ సిరీసులు, మరోవైపు సినిమాలు నిర్మిస్తోంది. అందరూ కొత్తవాళ్లతో 'కమిటీ కుర్రోళ్లు' అనే మూవీ తీసి బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టింది. ప్రస్తుతం చిన్న, మీడియం రేంజ్ ప్రాజెక్ట్స్ డీల్ చేస్తున్న నిహారిక.. భవిష్యత్ లో స్టార్ హీరోలతో భారీ బడ్జెట్ సినిమాలు రూపొందించాలని ఆశ పడుతోంది. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాకి గాను నిహారిక ఇటీవల ఓ అవార్డుల కార్యక్రమంలో 'వర్సటైల్ ప్రొడ్యూసర్ ఆఫ్ ఇది ఇయర్' పురస్కారాన్ని అందుకుంది. ఒకవేళ అవకాశం వస్తే నిర్మాతగా టాలీవుడ్ హీరోల్లో ఎవరెవరితో ఎలాంటి జానర్ సినిమాలు చేస్తారు? అని యాంకర్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. దీనికి నిహారిక స్పందిస్తూ.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నుంచి చాలా యాక్షన్ చూసేశాం కాబట్టి, ఒక మంచి లవ్ స్టోరీ చేస్తానని తెలిపింది.

సూపర్ స్టార్ మహేష్ బాబుతో మైథలాజిక్ మూవీ చేస్తానని నిహారిక చెప్పింది. రెబల్ స్టార్ ప్రభాస్ తో ఒక కామెడీ సినిమా చేయాలనుందని తెలిపింది. 'బుజ్జిగాడు' సినిమాలో ఆయన కామెడీ చాలా బాగా నచ్చిందని, అందుకే అలాంటి జోనర్ లో చేస్తే బాగుంటుందని మెగా తనయ పేర్కొంది. ఒకవేళ డైరెక్షన్ చేస్తే మాత్రం తొలి సినిమా తన అన్న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌తో చేస్తానని చెప్పుకొచ్చింది. మహేష్ బాబు, ప్రభాస్, అల్లు అర్జున్ లతో సినిమాలు తీయాలనే మెగా డాటర్ కోరిక నెరవేరాలని అభిమానులు కోరుకుంటున్నారు. కాకపోతే ప్రస్తుతం వందల కోట్ల బడ్జెట్ తో భారీ సినిమాలు చేస్తున్న అగ్ర హీరోలతో ప్రాజెక్ట్ సెట్ చేయడానికి చాలా టైం పట్టొచ్చని భావిస్తున్నారు. ప్రభాస్, మహేష్ లతో నిహారిక చెప్పిన జోనర్స్ వర్కౌట్ అవుతాయేమో కానీ.. బన్నీతో ప్రేమ కథ అంటే కష్టమే అని అంటున్నారు. 'పుష్ప 2' తర్వాత అల్లు అర్జున్ క్రేజ్ నెక్ట్స్ లెవల్ కు చేరింది. ఇప్పుడు ఇంటర్నేషనల్ స్థాయికి చేరుకోడానికి ప్లాన్ చేసుకుంటున్నారు. కాబట్టి ఒకవేళ నిజంగానే నిహారికకు అల్లు అర్జున్ తో సినిమా చేసే ఛాన్స్ లభించినా, లవ్ సినిమాలు చేసే అవకాశం లేదు.

# అప్పుడు మహేష్, ఇప్పుడు టామ్ క్రూజ్



సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉండేవారికి నిహారిక ఎన్ఎమ్ గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. ఆమె ఒక ఇన్‌ఫ్లూయెన్సర్, యూట్యూబర్, డిజిటల్ క్రియేటర్. తన వీడియోలతో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు కారణంగా ఈ బ్యూటీ తెలుగు ఆడియన్స్ దృష్టిలో పడింది. 'మేజర్' మూవీ ప్రమోషన్స్ లో భాగంగా సినిమా టికెట్ల కోసం మహేష్, నిహారిక క్యూలో నిలబడినట్లు క్రియేట్ చేసిన ఓ వీడియో అప్పట్లో తెగ వైరల్ అయింది. దాంతో టాలీవుడ్ లోనూ అమ్మడికి పాపులారిటీ వచ్చింది. ఇటీవలే హీరోయిన్ గా తెరంగేట్రం చేసిన నిహారిక.. ఇప్పుడు ఏకంగా హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్‌ను మీట్ అయింది.

టామ్ క్రూజ్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'మిషన్ ఇంపాజిబుల్: ది ఫైనల్ రెకనింగ్'. ఇది 2023లో వచ్చిన 'మిషన్ ఇంపాజిబుల్: డెడ్ రెకనింగ్' సినిమాకి సెకండ్ పార్ట్. %వీ×% ఫ్రాంచైజీలో 8వ సినిమాగా రూపొందింది. గ్లోబల్ వైడ్ గా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ చిత్రం.. ఈరోజు (మే 17) ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. తాజాగా లండన్ లో సినిమా ప్రీమియర్ జరిగింది. ప్రమోషన్స్‌లో భాగంగా వివిధ దేశాలకు చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ ను ఈ ప్రీమియర్ షోకు టీమ్ ఆహ్వానించింది. దీనికి నిహారిక ఎన్ఎమ్ కి కూడా ఇన్విటేషన్ అందింది. ఈ క్రమంలోనే యూకే వెళ్లి టామ్ క్రూజ్ ను కలిసింది.. ఫొటోలకు పోజులిచ్చింది.

టామ్ క్రూజ్‌ను కలిసిన విషయాన్ని నిహారిక సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ మిషన్ పాజిబుల్ అయినందుకు చాలా ఉత్సాహంగా ఉందని తెలిపింది. టామ్ ను మీట్ అవడం ఆశ్చర్యంగా ఉందని, తన కలను నిజం చేసినందుకు మిషన్ ఇంపాజిబుల్ టీంకి ధన్యవాదాలు అని నిహారిక రాసుకొచ్చింది. 'ఓం శాంతి ఓం' సినిమా మ్యూజిక్ ని జోడించి, ఓ స్పెషల్ వీడియోను ఆమె ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేసింది. టామ్ తన చేయి పట్టుకొని నడిపిస్తుంటే అమ్మడు మురిసిపోయింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అప్పుడు టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో, ఇప్పుడు హాలీవుడ్ సూపర్ స్టార్ టామ్ క్రూజ్‌తో అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'పెరుసు' అనే తమిళ సినిమాతో నిహారిక ఎన్ఎమ్ హీరోయిన్ గా పరిచయమైంది. వైభవ్ తో కలిసి నటించిన ఈ చిత్రానికి ఓటీటీలో అనూహ్య స్పందన లభించింది. దీంతో నిహారికకు మరిన్ని ఆఫర్స్ వస్తున్నాయి. ఇప్పటికే అధర్వ మురళి హీరోగా తెరకెక్కుతున్న 'ఇదయం మురళి' చిత్రంలో నటించే అవకాశం అందుకున్నట్లు తెలుస్తోంది.

# కోపం వచ్చి థియేటర్లో ఒకడ్ని కొట్టేశా..



సిరివెన్నెల సీతారామశాస్త్రితో కృష్ణవంశీ తనకున్న బంధం, అనుబంధం గురించి చెప్పుకొచ్చాడు. ఎప్పుడు? ఎక్కడ? ఎలా పరిచయం అయింది.. అసలు ఆయన రాసిన పాటల్లో మొదటగా విన్నది ఏంటి? ఆ అనుభవం ఏంటి? అనే విషయాల గురించి నా ఉఛ్వాసం కవనం అనే ప్రోగ్రాంలో కృష్ణవంశీ పంచుకు న్నారు. ప్రస్తుతం ఈ పాత ఇంటర్వ్యూలోని విషయాలు నెట్టింట్లో ట్రెండ్ అవుతున్నాయి. ఊర్లో ఖాళీగా తిరుగుతూ ఉన్నప్పుడు సినిమాల్లోకి రావాలని కృష్ణవంశీ అనుకున్నాడట. కానీ ఎలా రావాలన్నది? ఏం కావాలన్నది? క్లారిటీ ఉండేది కాదట.

ఆ టైంలోనే సిరివెన్నెల సినిమాను కృష్ణవంశీ చూశాడట. ఆ సినిమా సరిగ్గా ఎక్కడం లేదట. సడెన్‌గా ఆది భిక్షువుని ఏమీ అడిగేది అనే పాట విని షాక్ అయ్యాడట. అదేంటి? దేవుడ్ని తిడుతూ పాట రాశాడు అని అనుకున్నాడట. థియేటర్లో పక్కన కూర్చున్న వాడు ఆ పాట గురించి ఏదో కామెంట్ చేస్తే అతడ్ని కృష్ణవంశీ కొట్టేశాడట. అది తన ఊరు కాబట్టి.. తన కోసం కొంత మంది వచ్చి అవతలి వాడ్ని కొట్టి పంపించేశారు అని కృష్ణవంశీ చెప్పుకొచ్చాడు.

అప్పటి వరకు పాటలు అంటే వేటూరి అనుకున్నాడట. ఆ పాటని కూడా ఆయనే రాసి ఉంటాడని అనుకుంటే.. కొత్తగా సిరివెన్నెల పేరు కనిపించిందట. వెంటనే పాటల పుస్తకం కొనుక్కుని ఆ లైన్స్ అన్నీ నోట్ చేసుకున్నాడట. ఆ పాటలోని భావం ఎంతో నచ్చిందని, అప్పటికి నిందాస్తుతి అనేది ఉంటుందని కూడా తనకు తెలీదని కృష్ణవంశీ చెప్పుకొచ్చాడు. ఆ తరువాత ఇండస్ట్రీలోకి వచ్చి లైట్ బాయ్, కెమెరా అసిస్టెంట్, ఎడిటింగ్ ఇలా అన్ని డిపార్ట్మెంట్లలో పని చేస్తూ ఉన్నానని తెలిపాడు. రాజేంద్ర ప్రసాద్, చంద్రమోహన్ సినిమాకి కూడా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న టైంలో సిరివెన్నెల సీతారామశాస్త్రిని మొదటి సారి చూశాడట. ఆ మూవీ కోసం ఓ పాట రాసేందుకు అక్కడకు సిరివెన్నెల వచ్చారట.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,